ట్రంప్ నిర్ణయాలు అంగీకరిస్తే దేశానికి మరణశాసనమే..
• తిరుపతి సదస్సులో వి.శ్రీనివాసరావు
2

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 265 | విజయవాడ, సోమవారం 28 ఏప్రిల్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 28 April 2025 | Rs

ఎదురులేని ముంబయి
• హార్దిక్ సేనకు వరుసగా ఐదో విజయం
• నిప్పులు చెరిగిన పేస్ ద్వయం బుమ్రా, బౌల్ట్
• సూపర్‌జెయింట్స్‌పై 54 పరుగులతో గెలుపు

6



కర్నూలు జిల్లా కౌతాళంలో వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

ముంచిన అకాల వర్షాలు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో తడిసి ముద్దయిన ధాన్యం
- పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి, రాయదుర్గం (అనంతపురం జిల్లా)

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆదివారం కురిసిన అకాల భారీ వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వడగళ్ల వాన వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందడంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా కౌతాళం మండలం నదిచాగి గ్రామంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం ఒక్కసారిగా విరుచుకుపడడంతో రైతులు అప్రమత్తమయ్యేలోపే నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కౌతాళం, ఆలూరు, ఎమ్మిగనూరు మండలాల్లో కళ్లాల్లో అరబెట్టిన ధాన్యం రాశులు తడిచి ముద్దయింది. కొన్నిచోట్ల ధాన్యం రాశులు వర్షానికి కొట్టుకుపోయాయి. కోసి పొలాల్లో ఆరబెట్టిన వరి కంకులు తడిసిపోయాయి. ధాన్యం నేలపాలై కొట్టుకుపోయింది వరి పంట చేలు నేలకొరగడంతో కంకులు తడిచిపోయాయి. నంద్యాల జిల్లా జేర్లింగాపురంలో వర్షానికి ఇదే విధమైన నష్టం వాటిల్లింది. అవుకు మండలంలో భారీగా గాలులు వీయడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రామాపురంలో చెట్లు కూలాయి, కోవెలకుంట్ల మండలంలో కోత కోసి కళ్లంలో ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. కోసి పొలంలో ఆరబెట్టిన మిరప తడిసి దెబ్బతింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని నష్టపోయిన రైతులు కోరుతున్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. దుగ్గిలమ్మ గుడి వీధి, మధు టాకీస్ ప్రాంతంలో రోడ్లు, వీధులు జలమయ్యాయి. గుమ్మగట్ట మండలం రంగచేడు గ్రామంలో పిడుగు పడి ఓ కొబ్బరి చెట్టు కాలిపోయింది.

కౌతాళంలో విషాదం



అశోక్(ఫైల్)

కర్నూలు జిల్లా కౌతాళం మండలం కాత్రికి గ్రామంలో పిడుగు పాటుకు ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... కాత్రికి గ్రామ శివారులో బాలయ్య (22), అశోక్ (21), గంగాధర్, నిరుపాది అనే యువకులు క్రికెట్ ఆడుతున్నారు. ఒక్కసారిగా వాతావరణం మారి గాలివాన రావడంతో వారంతా సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. ఆ చెట్టుపై పిడుగు పడటంతో బాలయ్య, అశోక్ మృతి చెందారు. మిగిలిన ఇద్దరూ గాయపడ్డారు.



బాలయ్య (ఫైల్)

పహల్గాం ఉగ్రదాడిపై ఎన్ఐఎ దర్యాప్తు

శ్రీనగర్ / న్యూఢిల్లీ : జమ్ము కాశ్మీర్‌లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దర్యాప్తు ప్రారంభించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దర్యాప్తు బాధ్యతలను జమ్ముకాశ్మీర్ పోలీసుల నుంచి ఎన్ఐఎ అధికారికంగా తీసుకుంది. ఆదివారం ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రత్యక్ష సాక్షుల విచారణను ప్రారంభించింది. ఇప్పటికే ఈ ఘటనపై భారత భద్రతా బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టిన సంగతి తెలిసిందే. ఎన్ఐఎ తన దర్యాప్తులో భాగంగా వీరి సహకారాన్ని కూడా తీసుకోనుంది. ఘటన జరిగిన సమయంలో ఉగ్రవాదులను చూసిన పర్యాటకులను పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన పోలీసు సూపరింటెండెంట్ పర్యవేక్షణలో విచారి స్తున్నట్లు ఎన్ఐఎ అధికారులు తెలిపారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. పర్యటన సమయంలో ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పహల్గాంలోకి ప్రవేశించే, నిష్క్రమించే ప్రాంతాల్లో ఫోరెన్సిక్ బందం సహాయంతో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. కాగా బైసరన్ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ముష్కరులు కాల్పులు జరిపిన విషయం తెలుసుకొని తొలుత కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు (సిఆర్‌పిఎఫ్) క్విక్ యాక్షన్ టీమ్ స్పందించిన సంగతి విదితమే. 25 మంది కమాండోలతో కూడిన బందం రాళ్లు, బురద మార్గంలో దాదాపు 40–45 నిమిషాలు ట్రెక్కింగ్ చేసి ఘటనాస్థలానికి చేరుకుంది. వెంటనే పహల్గాం చుట్టూ సిఆర్‌పిఎఫ్ యూనిట్ చెక్‌పోస్టులు, ఘటనాస్థలానికి సమీపంలో సురక్షిత పాయింట్లను ఏర్పాటు చేసింది. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని పర్యాటకులను ఇతర ప్రాంతాలకు తరలించిన సంగతి తెలిసిందే.


ప్రజా రాజధానిగా అమరావతి

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- పనుల పున:ప్రారంభంపై సమీక్ష

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం రాష్ట్రానికి నవోదయం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మే 2న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదగా జరగనున్న రాజధాని అమరావతి పనులు పున:ప్రారంభ కార్యక్రమంపై ఉండవల్లిలోని తన నివాసంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడు గర్వపడేలా ప్రజా రాజధానిని నిర్మిస్తామని సిఎం చంద్రబాబు అన్నారు. నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు రాష్ట్ర రాజధాని ప్రయాణం సాగనుందని చెప్పారు. గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు, దాడులు చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం కారణంగా తలెత్తిన సవాళ్లను పరిష్కరించి, నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే మళ్లీ పట్టాలెక్కిస్తుందన్నారు. ఏ ప్రధాని చేతుల మీదుగా అయితే శంకుస్థాపన చేసిన రాజధానిని విధ్వంసం చేశారో, మళ్లీ అదే ప్రధాని చేతుల మీదుగా పనులు తిరిగి ప్రారంభించనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా, వేడుకగా నిర్వహించాలని ఆదేశించారు. ఒక అద్భుత రాజధానిని నిర్మించి విధ్వంసకారులకు గట్టి సమాధానం చెబుతామన్నారు. అమరావతి రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష, సెంటిమెంట్ అని, దీనిని ఎవరూ దెబ్బతీయలేరని తెలిపారు. సంపద సృష్టి కేంద్రంగా ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాంతంగా మారుతుందన్నారు.

రాష్ట్రంలోని ప్రతి పౌరుడు, 'నాది ఆంధ్రప్రదేశ్–నా రాజధాని అమరావతి' అని చెప్పుకునేలా నిర్మాణం ఉంటుందన్నారు. ప్రధాని కూడా రాజధాని నిర్మాణంపై ఆసక్తితో ఉన్నారని, ఇటీవల ఢిల్లీలో ఆయనతో జరిగిన భేటీలో పలు సూచనలు చేశారని చెప్పారు.



ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

రాజధాని పనులు పున:ప్రారంభం కార్యక్రమం నిర్వహణ క్రమాన్ని, ఏర్పాట్లను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చూడాలని అధికారులకు సిఎం సూచనలు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి తాగునీరు, ఆహారం అందించాలని తెలిపారు. భద్రతా పరంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా వేదిక వద్దకు చేరుకునేలా చూడాలని ఆదేశించారు. రాజధాని గ్రామాల ప్రజలకు ఈ కార్యక్రమంలో ఎక్కువ భాగస్వామ్యం ఉంటుందని, వారంతా సభకు రావాలని భావిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి నారాయణ, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జెండా ఊపి బైక్ యాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సీతారాం

ఇళ్ల కూల్చివేతను ఆపేయాలి

- ఉండి నియోజకవర్గంలో సిపిఎం బైక్ యాత్ర

ప్రజాశక్తి – భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో ఇళ్ల కూల్చివేతను తక్షణం విరమించాలని, కాలుష్యానికికారణాలను పరిశీలించేందుకు అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో బైక్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రను పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్ నుంచి సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ఆరు నెలల నుంచి పేదల ఇళ్ల కూల్చివేత కొనసాగుతోందన్నారు. కాలుష్యం పేరు చెప్పి పేదల ఇళ్లను విధ్వంసం చేయడం సబబు కాదన్నారు. తాగునీటి కాలుష్యానికి కారణాలను తెలుసుకునేందుకు నిపుణులతో ఒక కమిటీ వేసి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అధ్యయనం చేయాలని కోరారు. ఏళ్ల తరబడి నివసిస్తున్న పేదలను ఇప్పటికిప్పుడు ఖాళీ చేయమనడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి వాసుదేవరావు, ఉండి మండల కార్యదర్శి చీర్ల శేషగిరిరావు, పాలకోడేరు మండల కమిటీ సభ్యులు దున్న మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం వ్యక్తిగత దూషణలకు పాల్పడదు 2
ప్రజల కోసమే నిరంతర పోరాటం : శ్రీనివాసరావు



కాశ్మీర్ విద్యార్థుల కోసం నోడల్ ఆఫీసరుగా సిద్ధార్థ్ కౌశల్

- డిజిపి ప్రకటన

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్న కాశ్మీరీ విద్యార్థులు, వ్యక్తుల సహాయం కోసం నోడల్ ఆఫీసరును నియమించినట్లు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నోడల్ ఆఫీసరుగా ఎఐజి అండ్ లా అండ్ ఆర్డర్ సిద్ధార్థ్ కౌశల్‌ను నియమించామని తెలిపారు. అవసరమైన వారు 0863 2340471 నెంబరును సంప్రదించాలని డిజిపి తెలిపారు.

రాజధాని నిర్మాణానికి అప్పు స్థానంలో గ్రాంటుగా ప్రధాని ప్రకటించాలి

- విభజన చట్టం అమలుపై స్పందించాలి
- సిపిఎం డిమాండ్
- మోడీకి బహిరంగ లేఖ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను అప్పు రూపంలో కాకుండా గ్రాంటుగా ప్రకటించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాజధాని అమరావతి పనుల పున:ప్రారంభానికి మే 2న విచ్చేస్తున్న సందర్భంగా ప్రధాని మోడీకి సిపిఎం రాష్ట్ర కమిటీ బహిరంగ లేఖ రాసింది. ఈ లేఖను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వర రావు, సిహెచ్ బాబూరావు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం విడుదల చేశారు. అనంతరం వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో రాష్ట్ర రాజధాని విషయంలో బిజెపి ఆధ్వర్యంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసిందని విమర్శించారు. రాజధాని బాధ్యత కేంద్రానిదే అని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నా, కేవలం రూ.1,500 కోట్లు కేటాయించింద న్నారు. ప్రపంచ బ్యాంకు, హడ్కోల నుంచి రూ.31 వేలకోట్లు అప్పు రూపంలో ఇప్పిస్తామని ప్రకటన చేశారని, ఇందులో కేంద్రం గ్రాంటు కేవలం రూ.1,400 కోట్లు అని తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాజధాని నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని, వీటిల్లో కేంద్రం ఎంత ఇస్తుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. దీనిపై బహిరంగంగా ప్రధాని మోడీ ప్రకటన చేయాలని కోరారు. రాజధాని శంకుస్థాపన కార్యక్రమానికి 2015లో విచ్చేసిన నరేంద్ర మోడీ ఆర్భాటంగా నీళ్లు, మట్టి తెచ్చి ఎంతో గొప్పగా చెప్పారని అన్నారు. మళ్లీ పనులు పున:ప్రారంభానికి మోడీ వస్తుండటంతో ప్రజల్లో అనేక సందేహాలు, అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. అప్పులు, మిగతా 2లో



ప్రధానికి బహిరంగ లేఖను విడుదల చేస్తున్న వై వెంకటేశ్వర రావు, సిహెచ్ బాబూరావు, వై.నేతాజీ, ఎం.రవి

కాశ్మీర్‌లో పౌరుడి కాల్చివేత

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో మళ్లీ చిగురుటాకులా వణికిపోతోంది. పహల్గాంలో ఉగ్రవాది అనంతరం జమ్ముకాశ్మీర్‌లో భద్రతను అత్యంత నిశిత పరిశీలనతో కట్టుదిట్టం చేశామని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటించినా.. మరోవైపు సాయుధులు ఇళ్లలోకి చొరబడి సాధారణ పౌరులను బలి తీసుకుంటున్నారు. ఉత్తర కాశ్మీర్ లోయలోని కుప్వారా ప్రాంతంలో ఒక ఇంట్లోకి శనివారం రాత్రి సాయుధ దుస్తుల్లో చొరబడిన అగంతకుడు విచక్షణారాహిత్యంగా జరిపిన కాల్పుల్లో ఒక పౌరుడు మరణించారు. మృతుడిని గుల్వాన్ రసూల్ మగ్రే (44)గా గుర్తించారు. కుప్వారాలోని కాని ఖాస్ ప్రాంతంలో గుల్వాన్ ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని సాయుధ దుండగుడు కాల్పులు జరిపినట్లు పోలీసు అధికారులు ఆదివారం తెలిపారు. కాల్పులు తర్వాత సదరు సాయుధ అగంతకుడు పారిపోయాడని, కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన గుల్వాన్‌ను శ్రీనగర్‌లోని శ్రీమహారాజా హరిసింగ్ (ఎస్ఎంహెచ్ఎస్)కు తరలించగా.. పరిస్థితి విషమించి చనిపోయారని తెలిపారు. ఉగ్రవాద దాడి తర్వాత లోయలో పోలీసులు, భద్రతా బలగాలు భారీ ఎత్తున సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరినీ అదుపులోకి తీసుకుంటున్నారు. గడిచిన నాలుగు రోజుల్లో ఇప్పటికే 2500 మంది పైగా వ్యక్తులను భద్రతా బలగాలు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సాంస్కృతిక, రాజకీయ ఉద్యమంతోనే గ్రంథాలయాలకు పునరుజ్జీవం

- రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

గ్రంథాలయాలకు పునరుజ్జీవం రావాలంటే గతంలో మాదిరి సాంస్కృతిక, రాజకీయ ఉద్యమం అవసరమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎపి గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సు'ను విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. వీటిని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడమే ప్రస్తుత పరిస్థితికి కారణమన్నారు. పిల్లల్లో పఠనాశక్తి పెంపొందించాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ఈ చర్యలు తీసుకోవాలని ఇందుకు అవసరమైన వ్యవస్థలను పాఠశాలల్లోనే రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రారంభోపన్యాసం చేసిన మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. గ్రంథాలయ ఉద్యమం అంటే ఒక పెద్ద వారసత్వమని పేర్కొన్నారు. సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమంగా ప్రారంభమై, సామాజిక, సంఘ సంస్కరణల ఉద్యమాలుగా రూపాలు సంతరించుకుని ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించిందని తెలిపారు. ఆంధ్రోద్యమం, తెలంగాణ పోరాటాలుగా.. సాంస్కృతిక ఉద్యమం నుంచి రాజకీయ పోరాటంగా మారిందన్నారు. గ్రంథాలయం అంటే కేవలం పుస్తకాలు చదువుకుని, కాస్త జ్ఞానాన్ని సంపాదించుకునే చిన్న విషయంగా చూడలేమన్నారు. సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమం నుంచి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు వరకూ గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఇందుకు కృషి చేసిన మహానుభావులు ఏ స్వాతంత్ర్యోద్యమ నాయకులకు తీసిపోరని తెలిపారు. ప్రస్తుతం గ్రంథాలయాలు చూస్తే ఆందోళన చెందక తప్పదన్నారు. గ్రంథాలయాల పట్ల కనీస స్పృహ కూడా లేని పాలకులు ఉండటంతోనే గ్రంథాలయాలకు ఈ పరిస్థితి దాపురించిందన్నారు. పాఠశాల విద్యాశాఖకు గ్రంథాలయాల బాధ్యత అప్పగించడం మరో పొరపాటుగా పేర్కొన్నారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో గ్రంథాలయాలకు అధిక ప్రాధాన్యత అక్కడి ప్రభుత్వాలు ఇస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలోనూ అటువంటి పరిస్థితి రావాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. పాఠశాలల్లోనే గ్రంథాలయాలను ఏర్పాటు చేసి మిగతా 2లో



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, వి.బాలసుబ్రహ్మణ్యం, పరిమి తదితరులు

పారిశుధ్య కార్మికుడు మరణిస్తే కుటుంబానికి రూ.30 లక్షలు

- మ్యాన్‌హోల్స్ శుభ్రంచేస్తూ చనిపోయిన వారందరికీ చెల్లించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి – అమరావతి

పారిశుధ్య కార్మికులు మ్యాన్‌హోల్స్‌లో పనిచేస్తూ మరణిస్తే ఆ కార్మికుడి కుటుంబానికి రూ.30 లక్షలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. మ్యాన్ హోల్స్ శుభ్రపరుస్తూ మరణించిన పారిశుధ్య కార్మికుడు మేడా మాణిక్యాలరావు కుటుంబానికి రూ.30 లక్షలను పరిహారం చెల్లించాలని, ఆయన భార్యకు ఉద్యోగం కూడా ఇవ్వాలని స్పష్టం చేసింది. మృతుడి పిల్లలకు విద్య, నైపుణ్య శిక్షణను కూడా ఇవ్వాలని ఆదేశించింది. ఇప్పటికే మాణిక్యాలరావు కుటుంబీకులకు రూ.10 లక్షలను పరిహారంగా ఇచ్చిన నేపథ్యంలో మిగిలిన రూ.20 లక్షలను నెల రోజుల్లో ఆయన కుటుంబానికి అందజేయాలని పేర్కొంటూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఇటీవల కీలక ఉత్తర్వులను వెలువరించింది.

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యంత్రాలతో కాకుండా ఇప్పటికీ మాన్యువల్ విధానంలో మ్యాన్ హోల్స్‌ను పారిశుధ్య కార్మికుల ద్వారా శుభ్రం చేయించడం చట్ట వ్యతిరేకమని విజయవాడకు చెందిన రిటైర్డు ఉద్యోగి తుటిక దాలయ్య గత ఏడాది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు. ప్రభుత్వం నుంచి వివరాల నిమిత్తం విచారణను జులై 19కి వాయిదా వేసింది.

1993 నుంచి మృతుల వివరాలను సేకరించండి లేకుంటే మున్సిపల్ కమిషనర్లను బాధ్యులను చేస్తామని హెచ్చరిక

మ్యాన్ హోల్స్‌ను శుభ్రపరిచేటప్పుడు మరణించే పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు చట్ట ప్రకారం తగిన పరిహారం చెల్లించాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.30 లక్షల పరిహారంతోపాటు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాల్సి ఉంది. ప్రస్తుత కేసులో మాణిక్యాలరావు కుటుంబానికే పరిమితం చేయడానికి వీల్లేదని, ఇదే తరహాలో గతంలో మరణించిన వారి కుటుంబాలకు కూడా పరిహారం అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. మ్యాన్ హోల్స్ మిగతా 5లో

ట్రంప్ నిర్ణయాలు అంగీకరిస్తే దేశానికి మరణశాసనమే..

- తిరుపతి సదస్సులో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ప్రపంచ దేశాలపై పెత్తనం కోసం, ఆర్థిక పుష్టికోసం ట్రంప్ చేస్తున్న నిర్ణయాలను అంగీకరిస్తే భారతదేశానికి మరణశాసనం రాసుకున్నట్లేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఏ దేశమైనా ప్రజల అవసరాల కోసం ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకుంటాయేగానీ, దేశంపై పెత్తనం ఇచ్చేందుకు కాదన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను పురస్కరించుకొని 'ట్రంప్ దూకుడు- భారత్‌పై ప్రభావం' అనే అంశంపై తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దేశంలోని ధనవంతులకు మరింత మేలు చేకూరేందుకు అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. అందులో విదేశీ దిగుమతులపై సుంకాల పెంపు నిర్ణయం ఒకటి అని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల భారత ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపబోతుందన్నారు. నీటిని వ్యాపారీకరణంగా చూడడం చాలా ప్రమాదకరమని, దీని వల్ల వ్యవసాయ రంగం కుదేలు అవుతుందన్నారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రతరం అవుతోందన్నారు. మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని గుర్తు చేశారు. ఇలాంటి తరుణంలో అమెరికా సుంకాల ఒప్పందం మరింత ప్రమాదకరమని తెలిపారు. భారత్‌పై పెత్తనం చలాయించేందుకు ట్రంప్ చూస్తున్నారని, అందులో భాగంగానే మోడీతో మంతనాలు జరిపేందుకు ఆ దేశ ఉపాధ్యక్షులు వాన్స్ భారత్‌లో పర్యటించారని అన్నారు. వాస్తవానికి ఎగుమతులు, దిగుమతుల విషయంలో భారత్‌కు రష్యా తక్కువ ధరకు సుఖోయ్ యుద్ధ విమానాలను సరఫరా చేస్తామంటున్నా వాటిని కొనుగోలు చేయకూడదని భారత్‌ను అమెరికా ఆదేశిస్తోందన్నారు. ఇరాన్, రష్యా నుంచి తక్కువ ధరకు పెట్రోల్, డీజల్, గ్యాస్ సరఫరా చేస్తామంటే దాన్ని కాదని అధిక ధరలకు అమెరికా నుండి కొనుగోలు చేయడం శోచనీయమన్నారు. రష్యా రూపాయిల్లోనే విక్రయాలు చేస్తానంటోందని, ఈ విధానం వల్ల అదే రూపాయిని వారు వినియోగించాలంటే తప్పనిసరి పరిస్థితుల్లో భారత్ ఉత్పత్తులనే కొనాల్సి ఉంటుందని తెలిపారు. డాలర్ చెల్లింపులైతే ఉత్పత్తులు వారికి నచ్చిన చోట కొనుగోలు చేయవచ్చని, రష్యా హామీ భారత్‌కు రెండు వైపుల మేలు చేస్తుందన్నారు. అయినా దాన్ని వద్దనడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలపై పెత్తనం కోసమే ట్రంప్ సుంకాలు పెంచారని, దీనికి చైనా దీటుగా స్పందిస్తే మధ్యమార్గం కోసం అన్వేషిస్తున్నారని తెలిపారు. మోడీ మాత్రం ట్రంప్‌తో సావాసానికి ఉవ్విళ్లూరుతున్నారని విమర్శించారు. దేశ స్వతంత్ర, విదేశాంగ విధానాన్ని ట్రంప్‌కు మోడీ తాకట్టు పెట్టారని విమర్శించారు. భారత ప్రయోజనాలు కాపాడేందుకు అమెరికా విధానాన్ని వ్యతిరేకించాలని, దేశం స్వతంత్ర వైఖరి అనుసరించాలని తెలిపారు. పహల్గం ఘటనలను ప్రతి ఒకరు ఖండించాలన్నారు. ఉగ్రవాదాన్ని అరికట్టాలంటే స్థానికుల సహకారం కూడా అవసరమని, ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల మదురైలో జరిగిన సిపిఎం జాతీయ మహాసభకు తిరుపతి నుంచి సైకిల్‌పై వెళ్లి పలువురికి పోరాట స్ఫూర్తిని నింపిన చల్లా వెంకయ్య, కుప్పస్వామిలను శ్రీనివాసరావు సత్కరించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

సిపిఎం వ్యక్తిగత దూషణలకు పాల్పడదు

- ప్రజల కోసమే నిరంతర పోరాటం: శ్రీనివాసరావు

సిపిఎం ఎప్పుడు వ్యక్తిగత దూషణలకు పాల్పడదని, వ్యక్తుల కోసం కాకుండా ప్రజల కోసమే నిరంతరం పనిచేస్తుందని వి శ్రీనివాసరావు తెలిపారు. సదస్సులో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చిన ఆయన రఘురామకృష్ణరాజు విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో పేదలకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చివేయడం సరికాదన్నారు. ఇళ్లు కూల్చివేత సమయంలో ఓ మహిళ గుండె పోటుతో చనిపోయారని, రెండు రోజుల తరువాత చనిపోయిన మహిళ పేరుతో అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మిస్తామని టిడిపి కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎందుకు ఇళ్లు కూల్చివేస్తున్నారని ప్రశ్నించారు. పేదలు నివసిస్తున్న ఇళ్లపై దౌర్జన్యం చేశారని, ప్రభుత్వ భూములు కబ్జా చేసిన పెద్దలను ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ప్రజల కోసం సిపిఎం నిరంతరం పోరాడుతూనే ఉంటుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటూ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్య

- వేటకొడవళ్లతో నరికిన దుండగులు

ప్రజాశక్తి- గుంతకల్లు

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ (60) దారుణ హత్యకు గురయ్యారు. గుంతకల్లులోని ఆలూరు రోడ్డులో రైల్వే బ్రిడ్జి వద్ద మారణాయుధాలతో దుండగులు చేసిన దాడిలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ గతంలో ఎంఆర్‌పిఎస్ నాయకుడిగా ఉండేవారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా పనిచేసిన అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఆయన తన కుమారుడు వినోద్, తన అన్న కుమారుడు కరెంటు గోవిందులతో కలసి స్కార్పియోలో గుంతకల్లు నుంచి ఆదివారం మధ్యాహ్నం ఆలూరుకు బయలుదేరారు. గుంతకల్లు పట్టణ శివారులోని ఆలూరు రైల్వే బ్రిడ్జి వద్ద ముందుగానే కాపుకాసిన దుండగులు టిప్పర్‌తో ఆయన వాహనాన్ని ఢీకొట్టారు. అప్పటికే అక్కడ పొలాల్లో కాపుకాసిన కొందరు మారణాయుధాలతో విచక్షణారహితంగా లక్ష్మీనారాయణపై దాడి చేశారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. వినోద్, గోవిందు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్య సమయంలో అక్కడి పొలాల్లో పనిచేస్తున్న కార్మికులు గట్టిగా కేకలు వేయడంతో తాము ప్రాణాలతో బయటపడ్డామని వినోద్, గోవిందు తెలిపారు. కాగా, 2006లో ఆలూరుకు చెందిన వైకుంఠం శ్రీరాములు హత్య కేసులో లక్ష్మీనారాయణ నిందితునిగా ఉన్నారు. శ్రీరాములుకు చెందిన వారే ఆయన హత్య చేసి ఉంటారని లక్ష్మీనారాయణ బంధువులు ఆరోపిస్తున్నారు.



స్కార్పియోను ఢీకొన్న టిప్పర్




లక్ష్మీనారాయణ (ఫైల్)

రాష్ట్రంలో బుల్డోజర్ సంస్కృతి

- ప్రశ్నిస్తే అనుచిత వ్యాఖ్యలు
- రఘురామకృష్ణరాజు తీరుపై మాజీ ఎంపి పి.మధు

ప్రజాశక్తి- అమరావతి



పేదల ఇళ్లను కూల్చివేయడం తగదని, ఇది బుల్డోజర్ సంస్కృతిని రాష్ట్రంలో తీసుకురావడమేనని సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు అన్నారు. దీనిపై ప్రశ్నించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 40, 50 సంవత్సరాల నుంచి పేదలు నివాసం ఉంటున్న ఇళ్లను బుల్డోజర్లతో అత్యంత దుర్మార్గంగా రాఘురామకృష్ణరాజు కూల్చివేయించడం తగదన్నారు. దీనిపై ప్రశ్నించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిగతంగా దూషించడం శోచనీయమన్నారు. రఘురామకృష్ణరాజును డిప్యూటీ స్పీకర్ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. 'పేదవాళ్ల ఇళ్లు ఎందుకు కూలగొట్టారో? వారికి ప్రత్యామ్నాయం ఎందుకు చూపలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు..నియోజకవర్గ ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న ఆయన అమర్యాదగా, అత్యంత నీచంగా మాట్లాడడం తగదన్నారు. దీనికి టిడిపి కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది మీరు ప్రవేశ పెడుతున్న రాజకీయ సంస్కృతా? అని ప్రశ్నించారు. సిపిఎం ఒక పద్ధతిగల పార్టీ అని, ఇటువంటి పార్టీ రాష్ట్ర కార్యదర్శిపై వ్యక్తిగత ధోరణితో దాడి చేయడం సహించబోమని హెచ్చరించారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మరో ఉపాధ్యాయుడు..

ప్రజాశక్తి-ముండ్లమూరు (ప్రకాశం జిల్లా)

ఉపాధ్యాయుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.5.18 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ముండ్లమూరు ఎపి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వైవి సుబ్బారావు ఫ్రాన్స్ దేశంలో చదువుతున్న తన కుమారుని కాలేజీ ఫీజు నిమిత్తం దర్శి స్టేట్ బ్యాంకులో తనకున్న ఖాతాలో రూ.5.48 లక్షలు జమ చేశారు. ఈ నెల 23న డబ్బులు అవసరమై ముండ్లమూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో ఎటిఎం ద్వారా రూ.10 వేలు ఒకసారి, రూ.2 వేలు మరొకసారి డ్రా చేశారు. అదే రోజు సాయంత్రం మూడు గంటల సమయంలో రూ.48 వేలు డ్రా చేసినట్లు ఆయన సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఉపాధ్యాయుడు దర్శిలోని స్టేట్ బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా నాలుగు దపాల్లో మొత్తం రూ 5.18 లక్షలు ట్రాన్స్ఫర్ అయినట్లు అధికారులు తెలియజేయడంతో ఆయన అవాక్కయ్యారు. బ్యాంకు అధికారులు ఐడిఐబి బ్యాంకుకు ట్రాన్స్ఫర్ అయ్యాయని సుబ్బారావుకు బ్యాంక్ వారు వివరించారు. సుబ్బారావు ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులుగా ఆశా వర్కర్లు

- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైద్య రంగాన్ని పరిరక్షించాలని, ఎన్‌హెచ్‌ఎంకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఆశా వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సెమినార్ తీర్మానించింది. నేషల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఏర్పాటుచేసి 20 ఏళ్లు పూర్తియిన సందర్భంగా విజయవాడలోని ఎంబివికెలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన సదస్సులో రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ఆశావర్కర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ప్రజారోగ్యం - ప్రభుత్వాల బాధ్యత' అనే అంశంపై ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు కె సాయి ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వైద్య రంగాన్ని ప్రోత్సహించే విధానం మానుకోవాలని, ప్రభుత్వ రంగానికి తగిన నిధులు కేటాయించి ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, పౌష్టికాహారం పొందలేని వారి సంఖ్య పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర దేశాల్లో ప్రభుత్వ వైద్య రంగాన్ని ప్రోత్సహిస్తున్నా, దేశంలో మాత్రం ఆ పరిస్థితి లేదని తెలిపారు. 'ఎన్ఎహెచ్ఎం పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు - సమస్యలు' అనే అంశంపై సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా ఎన్‌హెచ్‌ఎంలో సిబ్బందితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నట్లు చెప్పారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఆశా వర్కర్లకు మెటర్నిటీ లీవ్ కూడా అమలు చేయకుండా ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని తెలిపారు. వివిధ కేటగిరిల్లో పని చేస్తున్న సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఎన్‌హెచ్‌ఎం ఏర్పడి 20 ఏళ్లు అయిన సందర్భంగా ఆశా వర్కర్లు సాధించిన విజయాలు - ముందున్న సవాళ్లు' అనే అంశంపై యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు పోరాట ఫలితంగానే జాబ్‌చార్ట్ సాధించినట్లు తెలిపారు. గత రెండు దశాబ్దాల కాలంగా చేసిన పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో పారితోషికాలు స్థానంలో వేతనాలు సాధించుకున్నామని చెప్పారు. గతంలో ఎఎన్ఎం సంతకం ఉంటేనే పారితోషికాలు చెల్లించేవారని, పోరాట ఫలితంగా ప్రస్తుతం నేరుగా ఆశా వర్కర్లకే బ్యాంక్ ఖాతాల్లో వేతనం జమ చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను నేటికీ ఆశా వర్కర్లుగా గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య రక్షణకు కుటుంబాలను వదిలేసి రోజుల తరబడి బాధితులకు అండగా నిలబడి సేవలందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఆశా వర్కర్లపై రాజకీయ జోక్యంతో వేధింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ స్కీం వర్కర్లు అందరినీ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని తీర్మానించిపటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు, ఇతర ఒప్పందాలకు సంబంధించి ఉత్తర్వులు విడుదలయ్యే వరకూ ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె పోచమ్మ, కోశాధికారి ఎ కమల, రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనశ్రీ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. రాష్ట్ర నాయకులు బి సుధారాణి, అమరావతి, సిహెచ్ పద్మ, కె లక్ష్మి, సుభాషిణి, గుంటూరు జిల్లా సిఐటియు మాజీ కార్యదర్శి నేతాజి, రాజధాని ప్రాంత నాయకులు ఎం రవి, జి కుమారి, శ్రీలక్ష్మి, డి ధనలక్ష్మి, గౌరి, రేణుక, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ సాయి ప్రసాద్

సాంస్కృతిక, రాజకీయ ఉద్యమంతోనే గ్రంథాలయాలకు పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడున్న ఉపాధ్యాయుల్లో ఒకరికి ఆ బాధ్యతలు అప్పగించి పిల్లలకు పుస్తకాలు చదివే ఆసక్తిని పెంచాలన్నారు. కళాశాలల్లో ఉన్న లైబ్రేరియన్ పోస్టులు ఒక్కటీ భర్తీ చేయడం లేదని తెలిపారు. ప్రభుత్వం వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సు నేరుగా ఆయా శాఖల ఖాతాలకు వెళ్లకుండా సాంకేతికతను ఉపయోగించి గ్రంథాలయ సంస్థ ఖాతాలకు మళ్లించే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా 'గ్రంథాలయాల విజ్ఞానం' పుస్తకాన్ని విద్యావేత్త పరిమి ఆవిష్కరించారు. తొలుత కాశ్మీర్‌లోని పహల్గామ్ మృతులకు సంతాపం సూచకంగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరు ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'విద్యా సంస్థలు - గ్రంథాలయాలు', 'సాంకేతిక యుగం - పుస్తకాల పఠనావశ్యకత', 'పౌర గ్రంథాలయాలు - సమస్యలు - పునర్నిర్మాణం', 'పౌర గ్రంథాలయాలు - సాహిత్య ప్రాధాన్యత' వంటి అంశాలపై సదస్సులు నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. గ్రంథాలయ శాస్త్ర నిపుణులు రావి శారద, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు, పాపినేని శివశంకర్, మధురాంతకం నరేంద్ర, పెనుగొండ లక్ష్మీనారాయణ, వెన్నా వల్లభరావు, దాసరి వెంకట రమణ, అలపర్తి వెంకట సుబ్బారావు, పి సత్యవతి, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి టి మనోహర్‌నాయుడు, ఎంబివికె బాధ్యులు స్వరూపరాణి, ప్రజాశక్తి బుక్ హౌస్ జిఎం కె లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాక్‌ను ఏకాకి చేయాలి

పుస్తకావిష్కరణ సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ప్రపంచ దేశాల్లో పాకిస్తాన్‌ను ఏకాకి చేయాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రచించిన రాజకీయ, సామాజిక రచనల సంకలనం సత్యకాలమ్-2 పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడ వెన్యూ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. తొలి కాపీని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా పహల్గామ్ ఉగ్ర దాడిలో మరణించిన వారికి నివాళులర్పిస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 22న జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాక్ ప్రేరిపిత ఉగ్రవాదుల దాడికి దీటైన జవాబివ్వాలని ప్రజల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయని, తప్పనిసరిగా పాకిస్తాన్ ఊహించని విధంగా సమాధానం చెప్తామన్నారు. సైనికుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. పర్యాటకుల మృతికి కారణమైన పాకిస్తాన్ భారీ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని కిషన్‌రెడ్డి హెచ్చరించారు. దేశాన్ని ఎంతో దార్శనికతతో నిబద్దతో ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోడీపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఆరేళ్లపాటు సమకాలీన పరిస్థితులపై వ్యాసాలు రాసిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆయన అభినందించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. సమర్ధవంతమైన పాలనకు ప్రధాని మోడీ ప్రతీక అని అన్నారు. ఎన్ని సమస్యలొచ్చినా ఎదుర్కొని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అంధకారంలోకి నెట్టివేయబడిందన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమర్ధ నాయకత్వం ప్రజారంజక పాలనను అందిస్తోందని, గత ప్రభుత్వం మద్యం అక్రమాలకు పాల్పడిందన్నారు. రాష్ట్ర వికాసానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని పల్లా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పత్రికల్లోని ఎడిటోరియల్ వ్యాసాలను చదవాలని, యువ రాజకీయ నేతలు, యువ రచయితలకు ఎడిటోరియల్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. కాశ్మీర్‌లో ఉగ్ర దాడి, ప్రస్తుత పరిస్థితిపై గజల్ శ్రీనివాస్ ఆలపించారు.

సత్యకాలమ్-2 రచయిత, మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తాను 2019 నుంచి 2024 వరకు అనేక వ్యాసాలు రాశానని, దేశ సమగ్ర ప్రగతి కోసం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోడీ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టారంటూ వాటిని వివరించారు. వైసిపి ప్రభుత్వం మద్యం పాలసీ వల్ల రాష్ట్రంలో న్యూరో కేసులు పెరిగాయన్నారు. సభానంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని శాలువాలతో సన్మానించారు.



మధుసూదనరావు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

మధుసూదనరావు కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి - కావలి (నెల్లూరు జిల్లా)

కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు కుటుంబానికి అండగా ఉంటామని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తెలిపారు. నెల్లూరు జిల్లా కావలిలో మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులను వారు ఆదివారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల చెక్కును మధుసూదనరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాద చర్య జరగడం చాలా దురదష్టకరమన్నారు.

మధుసూదనరావు కుటుంబానికి అండగా ఉంటామని, కేంద్ర ప్రభుత్వం తరపున వారికి అందాల్సిన సదుపాయాలను అందజేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అవసరమైతే కుటుంబంలో ఒకరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కషి చేస్తామన్నారు. బీదా రవి చంద్ర మాట్లాడుతూ ఉగ్రవాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్‌డిఒ ఎం. వంశీ కృష్ణ, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎ అనుమతులు ఇవ్వాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ జిల్లాల ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచి సంక్షేమాభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) సేవలు నిలిచిపోకుండా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించి కేంద్రంలో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆర్‌డిటి సేవలకు అడ్డంకిగా నిధులు ఆపడాన్ని నిరసిస్తూ 'ఆర్‌డిటి సేవలు- ఆటంకాలు' అనే అంశంపై అనంతపురంలోని పెన్షనర్స్ భవన్‌లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్న దళిత, గిరిజన, బడుగుల జీవితాల్లో మార్పు తీసుకురావడం కోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఏర్పడిందని తెలిపారు. జిల్లాలో సెమి గవర్నమెంట్ లాగా ఆర్‌డిటి సేవలు 3244 గ్రామాల నుండి 3896 గ్రామాలకు, 4,51,200 కుటుంబాలకు విస్తరించాయని తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం సేవా సంస్థలపై దాడిని పెంచిందన్నారు. ఎఫ్‌సిఆర్‌ఎ చట్ట సవరణను తెచ్చి ఆర్‌డిటికి వస్తున్న నిధులకు ఆంక్షలు విధించిందని తెలిపారు. మత ప్రచారాలు, మత మార్పిడులు చేస్తోందని తప్పుడు ప్రచారం చేసి పేదలకు అందిస్తున్న సేవలను దూరం చేస్తోందన్నారు. తక్షమే ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ చేయాలని, సంస్థకు నిధుల సమస్య తీరేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎంపిలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఆర్‌డిటిని రక్షించుకునేందుకు ముందుకు వెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు నెరమెట్ల ఎల్లన్న, కెవిపిఎస్ రాష్ట్ర ఆధ్యక్షులు ఓ.నల్లప్ప, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు ఓబిలేసు, అనంత హుక్కుల వేదిక సొమర రాహూల్, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. శివారెడ్డి, బిఎంకెఎస్ కేశవరెడ్డి, తదితరులు మాట్లాడారు.

బిజెపి వైఖరి భభ్రమానం..భజగోవిందం..

- ఆపరేషన్ కగార్‌ను కేంద్రం వెంటనే నిలిపివేయాలి
- తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే
- బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి వైఖరి అంతా భభ్రమానం..భజగోవిందం అని బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ అన్నారు. బిజెపి పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనకబడిందని, ఆ పార్టీ నాయకులు చెప్పేదంతా శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు అని విమర్శించారు. బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బహిరంగ సభలో కెసిఆర్ పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించిన అనంతరం కెసిఆర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ వన్ కెసిఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. "సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాం. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. బిఆర్ఎస్ హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం. ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి" అని కెసిఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరపున పోరాడతా. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి అని అన్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా? అని కెసిఆర్ ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారని కెసిఆర్ విమర్శించారు. నక్సలైట్ల విజ్ఞప్తి మేరకు వారిని చర్చలకు పిలవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి ఢిల్లీకి పంపుదామని కెసిఆర్ అన్నారు. బహిరంగ సభకు తెలంగాణ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు.

రాజధాని నిర్మాణానికి అప్పు స్థానంలో గ్రాంటుగా ప్రధాని ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

వడ్డీల రూపంలో ఇచ్చే నిధులను ప్రజలే చెల్లించాల్సి ఉంటుందని, భవిష్యత్తులో ఇది భారంగా మారుతుం దని ఆందోళన వ్యక్తం చేశారు. కడప స్టీల్, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి నిధుల కేటాయింపుల పైనా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాజధానికి మరలా మరో 44 వేల ఎకరాలు భూసమీకరణ విధానంలో సేకరిస్తామని ప్రభుత్వం నుంచి ప్రకటనలు చేస్తుండటంతో రైతులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. తొలిదశలో భూములిచ్చిన రైతులు, కూలీల సమస్యల పరిష్కారానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం నుంచి రాజధానికి రావాల్సిన నిధులు కోరడంలో, పొందడంలో, ఒత్తిడి చేయడంలో విఫలమయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో డబుల్, త్రిబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అని చెబుతున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాటల్లో కాకుండా చేతల్లో నిధులు సాధించాలని, ఆ మేరకు కేంద్రంపై ఒత్తిడి చేయాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. 41 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు 300 ఎకరాలకు పైగా స్థలాలు కేటాయించారని, వీటి నిర్మా ణాలను ఆరు నెలల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేశా రు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే రీతిలో మోడీ వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వై నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలు సరికావు

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సిపిఎంపైన, పార్టీ కార్యదర్శిపైన చేసిన అనుచిత వ్యాఖ్యలను బాబూరావు ఖండించారు. ఉండి నియోజకవర్గంలో సుమారు 900 ఇళ్లను కూల్చేయడంతో పేదలు రోడ్డున పడ్డారని, వీటిని తానే కూల్చినట్లు రఘురామ కృష్ణరాజు ప్రకటించారని తెలిపారు. కూల్చివేతలకు నిరసనగా ఆందోళనలు చేస్తున్న పేదలకు తమ పార్టీ అండగా నిలబడిందన్నారు. ఇళ్లను కూల్చడాన్ని ప్రశ్నిస్తే ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఆయన అసభ్య, అనుచిత పదజాలంతో దుర్భాషలకు దిగారని చెప్పారు. తాము సభ్యతగా వ్యవహరిస్తామని టిడిపి చెప్పిందన్నారు. ఆ పార్టీకి చెందిన రఘురామ కృష్ణరాజు అనుచిత వాఖ్యలపై స్పందించి, అదుపు చేయాల్సిన బాధ్యత టిడిపి అధినాయకత్వంపై ఉందన్నారు. ఇళ్ల తొలగింపులు ఆపి పేదలకు న్యాయం చేయాలని కోరారు.

'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దు

- అఖిలపక్ష కాంట్రాక్టు కార్మికుల సంఘం


ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)
వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను తొలగించాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు నందికి తాతారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1536వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో ఎఐటియుసి నాయకులు, కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ సుమారు 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఇప్పటికే విధుల నుంచి తొలగించారని, మరో 2500 మందిని తొలగించేందుకు యాజమాన్యం కుట్రలు చేస్తోందని అన్నారు. మూడు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ కార్మికులు శాశ్వత ఉద్యోగులతో కలిసి పని చేస్తూ పరిశ్రమ అభివృద్ధికి, ఉత్పత్తి పెరుగుదలకు శాయశక్తులా కృషి చేశారని తెలిపారు. అలాంటి వారికి కనీస గౌరవం ఇవ్వడంలేదని పైగా తొలగించడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరీక్షల పేరిట కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యలను ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

లేబర్ కోడ్‌లతో కార్మికుల భద్రతకు ముప్పు

- మే 20న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి
- కార్మిక సదస్సులో వక్తల పిలుపు


సదస్సులో అభివాదం చేస్తున్న సిహెచ్.నర్సింగరావు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని పలువురు వక్తలు అన్నారు. దేశవ్యాప్తంగా మోడీ సర్కారు అనుసరిస్తోన్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ మే 20న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో దాని జయప్రదం కోసం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సదస్సు జరిగింది. అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాజశేఖర్, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలోనే 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందని తెలిపారు. లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులు సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును, యాజమాన్యంతో జీతభత్యాలు బేరం ఆడుకోనే హక్కును కోల్పోతారన్నారు. యజమానికి నచ్చితే ఉద్యోగం, నచ్చకపోతే తొలగించే విధంగా చట్టాల్లో మార్పు తీసుకొచ్చారని తెలిపారు. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, సామాజిక భద్రత, పెన్షన్ సౌకర్యం వంటివన్నీ కోల్పోతారన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని తెలిపారు. మే 20న జరిగే సమ్మెను బలపరుస్తూ గ్రామీణ ప్రాంతంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు హర్తాళ్‌కు పిలుపునిచ్చాయన్నారు. సమ్మెను జయప్రదం చేయడం ద్వారా మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. సదస్సుకు అధ్యక్షవర్గంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు వ్యవహరించారు. పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కెఎం.శ్రీనివాస్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి, ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవా, సిఎఫ్‌టియుఐ నాయకురాలు కె.లక్ష్మి హాజరయ్యారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మే 20న జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సదస్సు ప్రారంభంలో ఇటీవల కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, మౌనం పాటించారు.



రూ.1.50 కోట్లు చెక్కును టిటిడి అదనపు ఈవోకి అందిస్తున్న దాతలు

ఎస్‌వి ప్రాణదాన ట్రస్టుకు రూ.2 కోట్లు విరాళం

ప్రజాశక్తి- తిరుమల:
తిరుమల ఎస్‌వి ప్రాణదాన ట్రస్టుకు ఆదివారం రూ. రెండు కోట్లు విరాళం వచ్చింది. శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.1.50 కోట్లు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల విరాళంగా ప్రకటించింది. ఈ మేరకు తిరుమలలోని టిటిడి అదనపు ఇఒ క్యాంపు కార్యాలయంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి ఆ సంస్థ జోనల్ హెడ్ కె ధారాసింగ్ నాయక్, రీజనల్ హెడ్ ఇ వెంకటేశ్వర్లు విరాళం చెక్కును అందజేశారు. శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు చెన్నయ్‌కు చెందిన పౌన్ ప్యూర్ కెమికల్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ రూ.50 లక్షలు విరాళంగా అందించింది.

'గురజాడ'ను విస్మరించడం తగదు

- 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పుస్తకావిష్కరణ సభలో వక్తలు


పాడుదమా స్వేచ్ఛాగీతం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలకపల్లి రవి, డివిజి శంకరరావు, మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి
మహాకవి గురజాడ వెంకట అప్పారావును రాష్ట్ర ప్రభుత్వం అవమానించిందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు తెలిపారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రుల మనోభావాలను కూడా ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. పాడుదమా స్వేచ్ఛాగీతం.... ఎగరేయుదమా జాతి పతాకం.. అంటూ సగటు పౌరుడి గుండెలను హత్తుకునే పాటను పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చెందిన గంటేడ గౌరునాయుడు రాసిన సంగతి తెలిసిందే. ఆయన రాసిన పాటల పుస్తకాన్ని సాహితీ స్రవంతి కార్యదర్శి చీకటి దివాకర్ ఆధ్వర్యాన నడిచే చీకటి ప్రచురణలు వెలుగుల కోసం అనే ప్రచురణ సంస్థ ద్వారా ముద్రించారు.

ఈ పుస్తకాన్ని విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పలువురి ప్రముఖలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలకపల్లి రవి, అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించాల్సిన ప్రముఖుల జయంతులు, వర్ధంతుల జాబితాలో గురజాడ పేరు లేకపోవడం సరికాదన్నారు. దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్.. అంటూ దేశాన్ని పాలించుకోవాలో, అభివృద్ధి చేయాలో స్వాతంత్ర్యోద్యమానికి ముందే చెప్పిన దార్శనికుడు గురజాడని కొనియాడారు. గురజాడతోపాటు తెలుగు భాష వికాసానికి ఎంతో కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు, సామాజిక మార్పు కోసం కృషి చేసిన కందుకూరి, గుర్రం జాషువా వంటి మహనీయుల పేర్లు కూడా ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. రామాయణం రాసిన మొల్ల తప్ప మహిళా ప్రముఖులకు కూడా ప్రాధాన్యత దక్కలేదని వివరించారు. సనాతన ధర్మాన్ని సవాలు చేస్తూ, కుల, మతాలను ప్రశ్నిస్తూ గురజాడ అనేక రచనలు చేశారని, అందువల్లే ఆయన పేరు పక్కనబెట్టారని విమర్శించారు.

గురజాడ గేయానికి కొనసాగింపే స్వేచ్ఛాగీతం :ఎంవిఎస్ శర్మ

దేశమంటే మట్టికాదోయ్... అంటూ గురజాడ రచించిన దేశభక్తి గేయానికి గంటేడ గౌరునాయుడు రాసిన పాడుదమా స్వేచ్ఛాగీతం అనే పాట కొనసాగింపేనని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. నాడు తెల్లదొరలు పాలించిన మన దేశంపై అమెరికన్ సామ్రాజ్యవాదులు పెత్తనం చెలాయిస్తున్నారని వివరించారు. నాటి జాతీయోద్యమ స్ఫూర్తిని దెబ్బతీయడానికి పాలకపార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. అందుకే గురజాడ వంటివారికి గుర్తింపు లేకుండా చేస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలకు జాతీయోద్యమ చరిత్ర తెలియాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఇందుకు పాడుదమా స్వేచ్ఛాగీతం అనే పాట ఎంతో తోడ్పాటునందిస్తుందని తెలిపారు. ప్రజా గాయకులు ఇటువంటి గీతాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, కవులు, కళాకారులు కూడా మరిన్ని దేశభక్తి గేయాలను అందించాలని ఆకాంక్షించారు.

పుస్తక రూపంలో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సహకరించాలి : డాక్టర్ డివిజి శంకరరావు

గంటేడ గౌరునాయుడు రాసిన కవితా సంకలనాలను పుస్తక రూపంలో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల తాను కర్నూలు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు విద్యార్థుల నుంచి పాడుదమా స్వేచ్ఛాగీతం అనే పాట వినిపించినప్పుడు ఎంతో ఆనందం కలిగిందని చెప్పారు. శ్రామికులు, రైతులకు, బాలల కోసం గౌరునాయుడు రాసిన రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, ప్రముఖ వైద్యులు జి.సన్యాసమ్మ పాల్గొన్నారు. గౌరునాయుడు రచించిన అనేక పాటలను గాయనీ, గాయకులు ఆలపించారు. కవులు, రచయితలు గౌరునాయుడు రచనలపై చర్చించారు.

6 వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లను, బోధన ఆస్పత్రులకు ఐదుగురు కొత్త సూపరింటెండెంట్లను వైద్య, ఆరోగ్య శాఖ నియమించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త పోస్టింగులు, బదిలీలకు ఆమోదం తెలిపారని ఆ శాఖ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ముగ్గురు ప్రిన్సిపాళ్లు, ఒక సూపరింటెండెంట్‌ను బదిలీ చేయడంతోపాటు ఖాళీల్లో ముగ్గురు కొత్త ప్రిన్సిపాళ్లు, ఐదుగురు కొత్త సూపరింటెండెంట్‌లను నియమించింది.

పుకార్లను నమ్మొద్దు : సిఆర్‌డిఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి పర్యటన సందర్భంగా 30 మంది రాజధాని రైతులకు సన్మానమంటూ రైతుల పేర్లతో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తలు అవాస్తవమని సిఆర్‌డిఎ పేర్కొంది. ఈ మేరకు ఆదివారం సిఆర్‌డిఎ ఒక ప్రకటన విడుదల చేసింది.



శ్రీవారి సుప్రభాత సేవలో హిట్-3 చిత్ర బృందం

ప్రజాశక్తి- తిరుమల:
సినీ నటుడు నాని, హిట్-3 కథానాయిక శ్రీనిధి శెట్టితో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. హిట్-3 సినిమా మే 1న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర బృందం అలిపిరి నుంచి మెట్ల మార్గంలో తిరుమల చేరుకుని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంది. ఆదివారం ఉదయం సుప్రభాత సేవలో పాల్గొని బృందం సభ్యులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ అధికారులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కియా ఇంజన్ల మాయం కేసులో పురోగతి

- పోలీసు కస్టడీలో ఆరుగురు నిందితులు
- ఇంజన్ల రికవరీకి ఢిల్లీ, తమిళనాడుకు ప్రత్యేక పోలీసు బృందాలు

ప్రజాశక్తి-పెనుకొండ
శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగిన కియా కార్ల ఇంజన్ల మాయం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఇంజన్లను రికవరీ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ఢిల్లీ, తమిళనాడుకు వెళ్లాయి. పెనుకొండ సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఎనిమిది మంది నిందితుల్లో ఆరుగురిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులతో ఒక బృందం ఢిల్లీకి, మిగిలిన నిందితులతో మరో బృందం తమిళనాడుకు వెళ్లింది. చోరీ చేసిన 940 కారు ఇంజన్లలో 288 ఇంజన్లను ఢిల్లీలో విక్రయించినట్టు సమాచారం. మిగిలిన ఇంజన్లను తమిళనాడులో విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును ఛేధించేందుకు ప్రత్యేకంగా ఒక డిఎస్‌పి, ఇద్దరు సిఐలు, ముగ్గురు ఎస్‌ఐలు, ఆరుగురు కానిస్టేబుళ్లతో ప్రత్యేకంగా సిట్‌ను నియమించిన విషయం తెలిసిందే. పోలీసులు తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వెళ్లి సుమారు ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని ఈ నెల 2న పెనుకొండ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం మూడురోజుల క్రితం ఆరుగురు నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టారు. సుమారు 288 కారు ఇంజన్లు ఢిల్లీలో అమ్మినట్లు విచారణలో వెలుగు చూసింది. నిందితులతోపాటు సిట్ బృందం ఢిల్లీ వెళ్లింది. మరో బందం తమిళనాడుకు వెళ్లి ఇంజన్లు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే కియా కార్ల ఇంజన్ల మాయం కేసుకు సంబంధించిన వివరాలు పూర్తి స్థాయిలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఆగస్టు 20 నుంచి 24 వరకు ఒంగోలులో సిపిఐ రాష్ట్ర మహాసభలు : కె రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ
సిపిఐ రాష్ట్ర 28వ మహాసభ ఆగస్టు 20 నుంచి 24 వరకు ఒంగోలులో నిర్వహించేందుకు ఆ పార్టీ రాష్ట్ర సమితి నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం సిపిఐ రాష్ట్ర 28వ మహాసభల ఆహ్వాన కమిటీ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో. రామకష్ణ మాట్లాడుతూ పార్టీ శత జయంతి సందర్భంగా మహాసభకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు .'పోరాటాల పురిటి గడ్డ' గా పేరొందిన 'ప్రకాశం వామపక్ష ఉద్యమం'లో రాష్ట్రానికి అత్యధిక రాష్ట్ర నాయకత్వాన్ని అందించిన చరిత్ర ఉందన్నారు. నల్లూరి వెంకటేశ్వర్లు నాయకత్వంలో పార్టీ వంద సంవత్సరాల వేడుకలను తొలిసారి ఒంగోలులో సిపిఐ రాష్ట్ర 28వ మహాసభ నిర్వహించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

ముంబయి ఇడి కార్యాలయంలో అగ్నిప్రమాదం

ముంబయి : కేంద్ర దర్యాప్తు సంస్థల్లో అత్యంత కీలకంగా వ్యవహరించే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి చెందిన ముంబయి కార్యాలయంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ ముంబయిలో బాలార్డ్ ఎస్టేట్ ప్రాంతంలో ఖైసర్ ఏ హింద్ భవనంలో ఉన్న ఇడి కార్యాలయంలో ఆదివారం తెల్లవారుజామున 2.31 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.
అయితే, ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాక సిబ్బంది 12 ఫైరింజన్లతో మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశాయి. మొదట మామూలు మంటగా కనిపించినా, ఉదయం 3:30 గంటల సమయంలో మంటలు తీవ్రంగా మారడంతో దాన్ని లెవల్-2 (భారీ అగ్ని ప్రమాదం) గుర్తించారు. ఇక ఈ భవనంలోని నాలుగు, ఐదు అంతస్తులలో అగ్ని ప్రమాదం జరిగినట్లు మున్సిపల్ అధికారి తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదని అధికారులు తెలిపారు.ఇడి కార్యాలయంలో ప్రమాదం చోటుచేసుకోవడం రాజకీయ, వ్యాపార రంగాల్లో చర్చకు దారితీసింది.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

లక్నో : ప్రముఖ విమానయాన సంస్థ 'ఇండిగో'కు చెందిన విమానానికి ఒక విదేశీయుడి నుంచి బాంబు బెదిరింపు రావడం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి విమానాశ్రయంలో తీవ్ర కలకలం రేపింది. దీంతో ప్రయాణికులంతా భయాందోళనలకు గురయ్యారు. వారణాసి నుంచి బెంగళూరు వెళ్తున్న ఇండిగో విమానంలో ఒక విదేశీయుడు తన వద్ద బాంబు ఉందని చెప్పడంతో భయాందోళనలు వ్యక్తమైనట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా.. కెనడాకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని భద్రతా సిబ్బంది ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. బాంబు బెదిరింపు ఘటన అనంతరం ఆ విమానాన్ని ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు వారణాసి విమానాశ్రయ డైరెక్టర్ పునీత్‌గుప్తా తెలిపారు. ఈ బెదిరింపు ఘటనపై ఇండిగో సిబ్బంది ఎప్పటికప్పుడు ఎటిసికి సమాచారం ఇచ్చారన్నారు. ఇండిగో విమానాన్ని నిలిపివేసి సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రమాణాల ప్రకారమే తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. భద్రతా సంస్థల నుంచి అనుమతి వచ్చాక ఈ విమానం ఆదివారం ఉదయం బెంగళూరు బయల్దేరిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

నేపాల్‌లో ఉపాధ్యాయుల నిరసన హోరు

ఖాట్మాండ్ : నేపాల్‌లో ఉపాధ్యాయ ఉద్యమం ఊపందుకుంది. పాఠశాల విద్యలో మార్పులు తీసుకురావాలని, వేతనాల పెంచాలని, ప్రోత్సహకాలు ఇవ్వాలని కోరుతూ టీచర్లు భారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం దేశ రాజధాని ఖాట్మాండ్‌లో ఉపాధ్యాయులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అయితే అక్కడి ప్రభుత్వం తీవ్ర అణిచివేత చర్యలకు పాల్పడింది. ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శనపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనలో ఏడుగురు ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. పాఠశాల విద్యలో ప్రస్తుత అవసరాలకు వీలుగా ప్రయోజనకర సంస్కరణలు తీసుకురావాలని, అందరికీ విద్య అందుబాటులో ఉండేలా పార్లమెంటులో చట్టం తీసుకురావాలని, అలాగే ఉపాధ్యాయులకు వేతనాలు, ప్రోత్సహకాలు పెంచాలని గత నెలరోజులుగా ఈ నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. ఆదివారం వేలాది మంది ఆందోళనకారులు ఖాట్మాండ్‌లో నయాబనేశ్వర్‌లోని ప్రాంతంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన భద్రతా వలయాన్ని ఛేదించేందుకు యత్నించారు. దీంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్, వాటర్ కెనాన్‌లను ప్రయోగించారని ప్రత్యక్షసాక్షులు తెలిపారు.



రచన అంటే వాస్తవ జీవితం
నుంచి పలాయనం కాదు;
వాస్తవ జీవితంలోకి మరింత
లోతుగా చూడటమే!

– ముక్తవరం పార్థసారథి



ఆ మౌనం ఏం చెప్పింది!

పహల్గాంలో భర్త పక్కన ఆమె మౌనం
దీనంగా, నిస్సహాయంగా
ఏం చెప్పింది, ప్రతి మనిషికి
ఏ సున్నితమైన వ్యక్తి కూడా
ఇప్పుడు మౌనంగా ఉండలేడు!

కొంచెం అటు ఇటుగా కట్టుబొట్టు తప్ప
అందరూ ఒకే బతుకు బతుకుతున్నారు
మీరు పిచ్చోళ్ళు కాకపోతే
మీకూ వాళ్ళకూ వైరమేముంది?
దుస్తుల్లోపల
ఎవరో మతం పేరు చెప్పి
మీలో మూర్ఖత్వాన్ని నూరిపోసి
ప్రాణాలను తీయమంటే తీసి
కన్నీళ్ళను అమ్ముకుంటున్నారు
మీరు మనుషులు కాకపోతే
మీ అమ్మ పేగు కూడా విలవిల్లాడుతుంది
విగతజీవుల్ని చూసి
ఏ దేవుడూ సంతోషించడు!

అందమైన దేవదారు చెట్లమధ్య
ముళ్ళచెట్లలా మీరు మానవాళికి భిన్నంగా ఉన్నారు
ఏడ్చేవాళ్ళను చూసి నవ్వుతున్నారు
కన్నీళ్ళు తాగి కడుపు నింపుకుంటున్నారు
రాక్షసులను మించిపోయారు
మిమ్మల్ని ఏ పేరుతో పిలవాలి
ఏదైనా మానవత్వం పాదుకొల్పేదే మతం!

– శాంతయోగి యోగానంద, 96522 71520

కుంకుమ పువ్వు

అదో భూతల స్వర్గం
ప్రేమికుల ప్రణయకావ్యం
జంటల్ని గుండెలకు హత్తుకునే
మన్మధుడి అంబుల పొది

మతమే మనిషైనప్పుడు
నిలువ నీడ కూడా
నీ పైకి తుపాకీ గురి పెడుతుంది
నిషిద్ధ స్థలమైపోతుంది
ఉద్విగ్న క్షణాలు భయకంపితమౌతాయి
కాశ్మీరం నెత్తుటి రంగు పులుముకుంటుంది
బులియన్ సరస్సు కన్నీటితో గడ్డ కడుతుంది
బైసరన్ లోయ మీద ఉన్మాదం నిప్పులు చెరుగుతోంది
పర్వతాలు చావు కేకలై ప్రతిధ్వనిస్తున్నాయి

మంచు పూలనేమీ అనకండి
తూటాల వర్షంతో రక్తసిక్తమైనాయి
కుంకుమ పువ్వులపై నిందలు మోపకండి
తమ ఇంటికి నిప్పెట్టుకునే విద్య
వాటికింకా తెలియదు!

బతుకు దెరువు కడుపు నింపుతుంది కానీ
సాటి మనుషుల్ని కడతేర్చడం నేర్పదు
అన్నం ముద్ద మీద ఒట్టు
కావాలంటే పసిపిల్లలా గుక్కపట్టి ఏడుస్తున్న
కాశ్మీర్‌ని అడగండి
మారణాయుధాలకు మాటలొస్తే
ఆకలి ఎంత భయంకరంగా ఉంటుందో
విడమర్చి చెప్పేవి!

ఆకాశాన్నంటిన పైన్ వృక్షాలకు
ఉన్మాదం ఊసు తెలియదు
రాజకీయ వ్యూహాల దుర్గంధం వాటిని సోకదు
మతాల మార్మిక విద్య వాటికి అబ్బదు
ఎండకు కరిగిన మంచు లాగా
కాశ్మీర్ గుండె ఆర్ద్రమైపోతున్నది!

ఎవరి వ్యూహాలో ఇవి
ఏమి ఆశిస్తున్నదో ఈ పన్నాగం
ఇదో పెద్ద దేవ రహస్యం!

ఇప్పుడు బతుకంటే తరుముకొస్తున్న చావుని
కావులించుకోవడమా!
ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పారిపోవడమా!
నిలబడిన నేలకు మోకరిల్లడమా?!

తనను ప్రేమగా తడిమే స్పర్శ కోసం
కాశ్మీర్ ఎదురు చూస్తున్నది!
ఏకత్వమనే సౌందర్యాన్ని
పెనవేసుకుందామా మరి!

– వైష్ణవి శ్రీ, 8074210263

యుద్ధ మోహం

ఏదో కమ్ముకుంటుంది
జీవితం చుట్టూరా
ఒకరిని ఒకరు
తేరిపారా చూసుకోలేకుండా

గట్టిగా కరచాలనం
చేయాలన్నా వణుకుతున్న
గుండె నరం మెదడుకు
భయ సంకేతాలిస్తుంది
ఇంత రద్దీ జన ప్రవాహంలో
మనమెవరం ఎక్కడున్నాం
అనే ప్రశ్న తలెత్తుతుంది

ఎంత విదిలించి చూసినా
అద్దంలో నాకు నేనే
మత్యువు ప్రేమికుడిగా ఆగుపడుతున్నాను
పేలని తుపాకీ శబ్దం వెంటాడుతూ
పరుగు పెట్టిస్తుంది
ఇంత అయోమయానికి
కారణమెవరు అన్నది
ఎవరికి వారు తెలిసీ వేస్తున్న ప్రశ్న కావడంతో
పాదాలు నిలవడంలేదు

మాటలన్నీ కరవై
మనుషులపైనే అపనమ్మకం
మొదలై చావంటే భయం
పారిపోయింది ఎప్పుడో!

అరణ్యమంతా నెత్తురోడుతూ
దుఃఖమొక్కటే జవాబుగా మిగిలిపోయింది!

ఎవరిని కదిలించినా
ఒక్కొక్కడు ఒక మర తుపాకీలా
మోగుతూ విరుచుకు పడుతున్నాడు
దేశమంతా అనవసరపు
యుద్ధ మోహంతో కదులుతుంది
రాజ్య పన్నాగంలో పాచికగా మారుతూ
మృత్యువు వేటకు బలిపశువు కాబోతోంది!

– కెక్యూబ్ వర్మ
94934 36277

'సెన్సార్' బోర్డు ద్వంద్వ ప్రమాణాలు..!



సందర్భం

భారత దేశ తొలితరం సామాజిక సంస్కరణవాదులు 'మహాత్మా' జ్యోతీరావు పూలే (11 ఏప్రిల్, 1827 – 28, నవంబర్ 1890); ఆయన భార్య సావిత్రీబాయ్ పూలే (3, జనవరి 1831 – 10 మార్చి, 1897) దంపతుల జీవితానికి సంబంధించిన హిందీ బయో పిక్చర్లో వాస్తవాల్ని సెన్సార్‌బోర్డ్ కట్ చేయడంలో– చరిత్రను సమాజానికి తెలియనీయ కూడదన్న దుర్నీతి, కాపట్యం ఇట్టే అవగతమవుతోంది. పూలే దంపతులు కుల వివక్ష మీదనే కాదు.. సతీ సహగమనం, బాల్య వివాహాలు, వితంతువుల పట్ల వివక్ష.. ఇలా అనేక సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా స్థిరంగా, ధైర్యంగా పోరాడారు. వారు తమను అడ్డుకుంటున్న అగ్ర కుల శక్తులను తట్టుకుంటూ మరీ పోరాటం కొనసాగించారు. 1873 సెప్టెంబర్ 24న 'సత్య శోధన్ సమాజ్'ను ఏర్పాటుచేసి సమానత్వం కోసం, అభ్యుదయం కోసం జీవితాంతం నిస్వార్ధంగా ఉద్యమించారు. మహిళలకు విద్య ఏమాత్రం అందుబాటులోలేని దశలో భర్త సహకారంతో అక్షర జ్ఞానం పొందిన సావిత్రీబాయ్ పూలే దేశంలోనే తొలి ఉపాధ్యాయినిగాగుర్తింపు పొందారు. బాలికలకు విద్యాలయాలు, యువ వితంతు మహిళలకు రెస్క్యూ హోమ్ సహా అనేకానేక విప్లవాత్మక మార్పులకు ఆ దంపతులు యావజ్జీవితం కృషి చేశారు.

పూలే సినిమాలో వాస్తవాలను కట్ చేసినంత మాత్రాన– ఇప్పటికే బహుముఖంగా రికార్డయిన వాస్తవాలు లోకానికి ఎప్పటికీ తెలియవనుకోవడం భ్రమే. పూలే సినిమాను సెన్సార్ బోర్డ్ (సభ్యులందరూ తిలకించి) అన్ని వయసుల వారూ చూసేలా 'యూ సర్టిఫికెట్'తో సహా విడుదలకు అన్ని అనుమతులూ ఈ ఏప్రిల్ ఏడునే ఇచ్చింది. సామాజికంగా బహిష్కరించబడిన మాలి (గార్డెనర్) కులానికి చెందిన– పూలే 196వ జయంతి సందర్భంగా ఈ నెల 11న విడుదలకు సినిమా యూనిట్ అన్ని ఏర్పాట్లూ చేసుకుంది. ఇంతలో సెన్సార్ బోర్డ్ అత్యంత అప్రజా స్వామికంగా, అసంబద్ధంగా– సినిమాలో కొన్ని 'అభ్యంతరాలు' (?) ఉన్నాయంటూ విడుదలను అడ్డుకుంది. మొత్తం 12 కట్స్ జాబితా పంపింది. ఆ కట్స్ అనంతరం ఏప్రిల్ 25న చిత్రం విడుదలైంది.

పూలే సినిమా విడుదలకు అభ్యంతరపెట్టిన బ్రాహ్మణవాద సంఘాలూ, సంస్థల అభిప్రాయాల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్న సెన్సార్ బోర్డ్– వాటికి చారిత్రక రుజువులతో సహా అత్యంత సహేతుక సమాధానాలిచ్చిన స్క్రీన్ ప్లే రైటర్, దర్శకుడు అనంత్ మహదేవన్ వాదనను అసలేమాత్రం పట్టించుకోలేదు. "పూలే కేవలం బయో పిక్ కాదు. కుల, లింగ వివక్షతను అధిగమించడానికి, వితంతువులకు గౌరవం అందించడానికి జ్యోతిబా పూలే, సావిత్రిబాయ్ పూలే 1850లో ప్రారంభించిన నిశ్శబ్ద సామాజిక విప్లవానికి ఇది ప్రతిబింబం. 175 సంవత్సరాల క్రితం ప్రగతిశీల లక్ష్యం ఇప్పటికీ పూర్తికాలేదు" అని దర్శకుడి వివరణ.

మహారాష్ట్రలో బ్రాహ్మణ పీష్వాలు రాజ్యమేలుతున్న కాలంలో మహర్లు, మాంగ్ (కులం పేర్లు తీసేయాలంది బోర్డ్)– (స్త్రీలు, పురుషులు) మెడలో ఓ ముంత, నడుం కిందికి ముడ్డి మీద చీపురు కట్టుకుని నడిచేవారు. వారి నడక ముద్రల్ని వారే చెరిపేసుకోవాలి. లేకుంటే.. ఆ దారిలో నడిచే అగ్ర కులస్థులు మైలబడిపోతారు.. దళితులు ఉమ్మును ఎక్కడబడితే అక్కడ కాకుండా ముంతలోనే ఊయాలి.. లేదంటే– వారు ఉమ్మిన రహదారులపై అగ్రవర్ణాల వారు నడిస్తే మైలబడిపోతారు.. ముంతలో ఊసి తమ ఇళ్లకు వెళ్లిన తర్వాత వారు ముంతను శుభ్రం చేసుకుంటారు. ఇలా మెడలో ముంత, ముడ్డికి చీపురు కట్టుకోకుండా రోడ్లపైకి వస్తే కఠినంగా శిక్షించిన సందర్భాలు చరిత్రలో ఎన్నో లిఖితమయ్యాయి. ఈ ప్రస్తావనను బ్రాహ్మణవాద సంఘాలు సహించలేకపోతే– దాన్ని కట్ చేసి– దాని బదులు– 'దూరంగా నడవాలి' అని చేర్చుకోవాలంది సెన్సార్ బోర్డ్. బ్రిటీష్ పాలనలో భారతీయులు నూరేళ్ల బానిసత్వంలో మగ్గారు. అయితే దళితులు మూడు వేల సంవత్సరాలుగా దారుణ వివక్ష అనుభవిస్తున్నారు అనే వాస్తవంలో.. మూడు వేలు అనే వివరాన్ని నిషేధించింది బ్రాహ్మణవాద ప్రాబల్య సెన్సార్ బోర్డ్. కుల వివక్షకు సంబంధించిన చర్చకు వాయిస్ కట్ చేయాలని ఆదేశించింది. కులం పేరూ ప్రస్తావించక.. వాయిస్ కూడా మైమ్ చేస్తే సినిమాకు అర్థమేముంటుంది? సావిత్రీబాయ్ పూలేపై ఓ బ్రాహ్మణ బాలుడు పేడ విసిరిన దృశ్యాన్ని.. అలాంటి సంఘటనకు చారిత్రక ఆధారాలు లేవని అభ్యంతరపెట్టారు. అయితే ఇదే సీనును ప్రఖ్యాత దర్శకుడు శ్యామ్ బెనెగల్ గతంలో తన సినిమా 'భారత్ ఏక్ ఖోజ్'లో చూపితే ఎలాంటి అభ్యంతరం లేదు. ప్రభుత్వ అధీనంలోని దూరదర్శన్‌లో సైతం 1988–'89లో ఆ సినిమాను ప్రసారం చేశారు. సెన్సార్ బోర్డుకు అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకొచ్చిందో..! ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహరాజ్ కథాంశంతో నిర్మించిన 'చావా' సినిమా విడుదల అనంతరం మత ఘర్షణలు జరిగాయి. వందల సంవత్సరాలనాటి ఔరంగజేబు చక్రవర్తి సమాధిని తవ్వాలని అల్లర్లు రేగాయి. శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమవుతుందని సెన్సార్ బోర్డ్ వారికి నామమాత్రంగానైనా స్ఫురించకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? 2023లో విడుదలైన 'కేరళ స్టోరీ' సినిమాలో– 35 వేల మంది హిందూ యువతుల్ని లవ్ జిహాద్ ద్వారా మతం మార్చి ఉగ్రవాద శిక్షణ గరుపుతున్నారని చూపితే అభ్యంతరాలున్నా సెన్సార్ బోర్డ్ అనుమతులిచ్చేసింది. దేశ అత్యున్నత న్యాయస్థానం– ఆ సంఖ్యకు ఆధారాల్లేవని అభ్యంతరం చెప్పి.. ట్రైలర్‌లో ఆ విషయం తెలపాలని ఆదేశించింది. ఆ విషయం గుర్తుకురాదా ఎవరికైనా? అయినా ఆ అంశాన్ని రాజకీయంగా విస్తృతంగా ప్రచారం చేసి ఓట్లు దండుకున్న వైనం చూశాంగా..! 'కాశ్మీరీ ఫైల్స్' సినిమాలో ప్రభుత్వ ఆధీనంలోని అత్యున్నత విద్యాసంస్థ జేఎన్టీయూ గౌరవాన్ని దారుణంగా దెబ్బతీశారు. 2002 గుజరాత్ అల్లర్లకు సంబంధించిన 'ది సబర్మతీ రిపోర్ట్'లో అనేక అబద్ధాలు ఉన్నా నిజాయితీగా తీసిన చిత్రం అని ఏకంగా పార్లమెంటులోనే ప్రదర్శించారు. మానవత్వానికే కళంకం వంటి గుజరాత్ అల్లర్లను కప్పిపుచ్చడానికి ఏకపక్షంగా తీసిన సినిమా అని దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. గుజరాత్ అల్లర్లలో వెయ్యి మందికి పైగా ముస్లిములు హతులయ్యారని రిటైర్డ్ జడ్జీలిచ్చిన స్వతంత్ర.. సాధికార నివేదికలు అందుబాటులోనే ఉన్నాయి. ఇన్ని 'ప్రాపగాండా సినిమాల'కు లేని అభ్యంతరాలు కోటానుకోట్ల బడుగు బలహీనవర్గాల ప్రజల ఆశాజ్యోతి సంఘ సంస్కర్త సినిమాకు ఎందుకు? సెన్సార్ బోర్డ్ అభ్యంతరపెట్టిన అంశాలను మరి అన్ని సందర్భాల్లోనూ ఒకేలా పాటిస్తున్నారా అంటే 'లేనేలేదు' అనే జవాబు వస్తుందనడానికి ఎన్ని ఉదంతాలైనా ఉదహరించొచ్చు. సెన్సార్ బోర్డ్ ఏంజేస్తున్నట్టు ఈ అన్ని సందర్భాల్లో..!? సినిమా కారణంగా శాంతి భద్రతల సమస్య వంటివి ఉత్పన్నం కావొచ్చు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే.. ఆ మేరకు అవి గెజిట్ రూపంలో అభ్యంతరం తెలిపితే విడుదలకు బ్రేకే. అయితే 'పూలే' విషయంలో ఏవిధమైన ఆంక్షలు అధికారికంగా వెల్లడించకున్నా సెన్సార్ బోర్డే నేరుగా చిత్రంపై దాడికి పూనుకుంది.. అదీ తన తొలి సంపూర్ణ సమ్మతిని తానే తోసిరాజని. బ్రాహ్మణవాద సంఘాలూ సంస్థలూ అభ్యంతర పెట్టినంతమాత్రానే సెన్సార్ బోర్డ్ ఇంతటి 'యూ టర్న్' తీసుకుందనుకోలేం. రాజకీయ వత్తిళ్లే ప్రధాన కారణమని ఎవరికైనా ఇట్టే తెలిసే రహస్యమే. బోర్డ్ ద్వంద్వ ప్రమాణాలకు ప్రతీకగా 'పూలే' నిలుస్తోంది. మన దేశంలో ప్రజావ్యతిరేక కుల.. మత.. రాజకీయ ఎజెండాలకూ సినిమాలు ఊతమివ్వడం దౌర్భాగ్యం... అందుకు– రెండు గంటల తొమ్మిది నిమిషాల నిడివి ఉన్న ఈ 'పూలే' సినిమా ఓ తాజా ఉదాహరణ. చరిత్రను సైతం సినిమాగా తీయడాన్ని అడ్డుకోవడం భావ ప్రకటన స్వేచ్ఛకు కచ్చితంగా విఘాతమేనని దేశవ్యాప్తంగా ప్రగతిశీలురు, రాజ్యాంగ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూలే నా ఆదర్శం.. నాకు స్ఫూర్తి అని– అదే మహారాష్ట్రకు చెందిన.. భారత రాజ్యాంగ పరిషత్ అధినేత, స్వతంత్ర భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రి భీమ్రావ్ రాంజీ అంబేద్కర్ పలు సందర్భాల్లో సగర్వంగా చాటుకున్నారు. ఆనాడు దేశంలో కుల వివక్ష ఎంత ఘోరంగా ఉండేదో అంబేద్కర్ తన 'ఇన్విలెంట్ ఆన్ కాస్ట్'లో విశదీకరించారు. పూలే సైతం ఆ వివరాలు– భారతీయ సామాజిక సంస్కరణ సాహిత్యంలో ఓ క్లాసిక్‌గా పరిగణించబడే తన 'గులాంగిరి' (బానిసత్వం)లో సోదాహరణలతో పేర్కొన్నారు. పోనీ.. బ్రాహ్మణవాదులు ఆరోపిస్తున్నట్టు పూలే బ్రాహ్మణ వ్యతిరేకా? అసలు కానేకాదు. ఆ రోజుల్లో.. పెళ్లయిన కాశీబాయ్ అనే యువతి అనతికాలంలోనే భర్త చనిపోతే.. అప్పటికే గర్భవతి అయిన ఆమె.. అబార్షన్ ప్రయత్నాలన్నీ విఫలం కాగా.. ప్రసవించిన అనంతరం ఆమె ఆ బిడ్డను చంపి బావిలో పడేసిన ఉదంతం పూలేను తీవ్రంగా కదిలించింది. 'భర్త చనిపోయాక బిడ్డను ఎలా కంటావ్' అని పాలకులు ఆమెను జైల్లో పెడతారు. వితంతువులు సంతానం కనడాన్ని అప్పటి పాలకులు నిషేధించారు. పూలే దంపతులు అలాంటి వితంతువులు తమ బిడ్డల్ని చంపుకునే దౌర్భాగ్య స్థితి నుంచి తప్పించడానికి – అనాథ శరణాలయం ఏర్పాటు చేసి.. ఎందరో అభాగ్య బ్రాహ్మణ యువతుల జీవితాలను కాపాడారు. పూలే దంపతులకు సంతానం లేకపోతే.. ఓ బ్రాహ్మణ వితంతు కుమారుడు యశ్వంతరావును దత్తత తీసుకున్నారు. అలాంటి పూలేను బ్రాహ్మణ వ్యతిరేకి అని ఎలా ముద్ర వేస్తారు? బ్రాహ్మణ దర్శకుడు తీసిన సినిమాను బ్రాహ్మణవాదులే అడ్డుకోవడం ఇక్కడ 'విశేషం'. చిత్ర కథా నాయకుడు.. టైటిల్ రోల్‌ను ప్రతీక్ గాంధీ, సావిత్రీబాయ్ పూలే పాత్రను పాత్ర లేఖ పాల్ పోషించారు.

సినిమాలో కట్స్ వేసినంత తేలికా చరిత్రలో వాస్తవాల్ని మరుగుపర్చడం..? 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ సోషల్ రివల్యూషన్'గా గణుతికెక్కిన పూలే జీవితాన్ని ఈ తరం.. రానున్న తరాలు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. చరిత్ర పుటల్ని చింపేస్తే 'పూలేలు' మరుగునపడి పోతారనుకుంటే అంతకుమించిన భ్రమ మరోటుండదు. పూలే కాలం నాటి పీష్వాలు ఇప్పుడు లేరేమో.. కానీ, సమాజంలో సమానత్వాన్ని జీర్ణించుకోలేని వ్యక్తుల్ని తరచూ గమనించొచ్చు. ప్రజల్ని కలిపి ఉంచడానికి రాజకీయాలు గానీ విడదీసి కొట్టుకునేలా ఈర్ష్యా ద్వేషాలు పెంచడానికి.. తద్వారా ఓట్లు నొల్లుకోవడానికి కాదు. ఏ కళారూపాలయినా జన జాగృతికే దోహదపడాలి. సమాజ హితాన్నే కాంక్షించాలి. ప్రజా చైతన్యాన్ని పెంచాలి. మూఢత్వాన్ని దునుమాడాలి. విస్తృత ప్రజా ప్రత్యక్ష/పరోక్ష భాగస్వామ్యంతో ప్రజా కళలు వర్ధిల్లాలి. చారిత్రక వాస్తవాల్ని కప్పెట్టే ఏ చిన్న ప్రయత్నాన్నైనా.. ఏ తరహా కుట్రల్నైనా సామూహికంగా, శాస్త్రీయ దృక్పథంతో ప్రతిఘటించాల్సిందే!

– జి.వి.రంగారెడ్డి
99126 15747

వాళ్లెవరైతేనేం?

వాళ్లెవరైతేనేం
మనుషుల్లా తండ్రీ మనుషులు
నీకులాగే కాళ్లూ చేతులున్నాయి
ముక్కూ మొఖముంది
చల్లని నవనీతంలాంటి హృదయముంది
బహుశ నీకది లేకపోవచ్చు

అందుకేగా
ఒకానొక కుంకుమ పువ్వులాంటి కలని
నెత్తుటి మయం చేశావు
పక్షుల్లా ఎగిరొచ్చి
పచ్చదనాన్ని తాగుతున్న జంట పావురాల్లో
ఒక ప్రేమపావురాన్ని చంపేసి
చోద్యం చూశావు
ఒక యాపిల్ పండును చిదిమేసి
నెత్తుటిలో అద్ది పోయావు
ఎవడు గోక్కుంటే వాడికే
రసికారే రాచపుండు కదా మతం
ఎవరికి సోకితే వాళ్ల
తొలగించుకోవాల్సిన
కుళ్లిపోయిన పుండే కదా అది
మతానిదేముంది
మనుషుల్లా తండ్రీ మనుషులు

ఎవరి మతం వారిదైనా
అభిమతం మనిషి కావాలి!

మనుషుల్ని చంపుకుంటూ
నువ్వు నిర్మించే మహా శ్మశానం
ఎవరికోసమో
ఒక్కసారి ఆలోచించు
మనిషిని తాకితే చిందాల్సింది
రక్తం కాదురా తండ్రి ప్రేమ
ప్రేమ చిందాలి
నీకు నీ సహచరి గుర్తురాలేదా
నీ స్నేహితురాలు గుర్తు రాలేదా
నీ తల్లి గుర్తు రాలేదా
నీ సోదరి వైధవ్యం గుర్తు రాలేదా
మొత్తంగా మనిషితనం మాయమైన
మత రాక్షసివి నువ్వు
పచ్చని చెట్టునుంచి
తొలగించాల్సిన వేరుపురుగు నువ్వు
తెల్లని మంచులాంటి మనిషితనం మీద
మెరిసే కుంకుమ పువ్వులాంటి మనిషి
నీకెలా కనిపిస్తాడు
నువ్వు మనిషివైతే కదా
తలలేని మొండానివి
నువ్వు మొండాలనే కలగంటావు
నీ తలను నువ్వే నరుక్కుని
నడిచెళుతున్న మొండంలా సాగిపోతావు
మనుషుల్ని చూడటానికి
ఎప్పటిలాగే నీకు తలవుండదు

వాళ్లెవరైతేనేం
మనుషుల్లా తండ్రీ మనుషులు
నీలాగే వాళ్ల మనుషులు
మనుషుల్ని ప్రేమించటం నేర్చుకో
దేశాన్ని ప్రేమించటమెలాగో తెలుస్తుంది!

– చిత్తలూరి

నీలి పంట రహస్యాల 'నీలంపు రాశి'

పుస్తకం

రచయిత్రి చంద్రలత చాలా ఒద్దికగా, ఓపికగా రాసిన సౌందర్యాత్మక కావ్యం, చారిత్రాత్మక నవల 'నీలంపు రాశి. బ్రిటిష్ వారు వృద్ధి చేసిన నీలి పంటను ఇతివృత్తంగా చేసుకొని రాసిన నవల ఇది. 1830– 70 వరకు చరిత్ర సంఘటనలను ఆధారంగా బ్రిటిష్ ఇండియాలో రాజకీయ, వ్యవసాయ మార్పులను మిక్కిలి నాటకీయంగా, హృద్యంగా తీర్చిదిద్దిన విధానం చాలా ముచ్చట గొలిపిస్తుంది.

బెంగాల్ నేటివ్ రచయిత శిశిరుడు ఓడ ప్రయాణం ద్వారా దండుబాటకు చేరుకోవడంతో నవల ప్రారంభమవుతుంది. దండుబాటలో రాబిన్సన్ అనే బ్రిటిష్ వ్యాపార సామ్రాజ్యానికి అధినేత జార్జ్. అతని కుమారుడు హ్యారీ... ఒక విధంగా ఈ నవలా నాయకుడు అతడే. అతడితోపాటు ఇంగ్లాండ్లో చదువుకుని బ్రిటిష్ ఇండియాలో మద్రాస్ ప్రెసిడెన్సీకి పరిపాలన అధికారిగా వచ్చిన ఖంష్ట్ర– శ్రీవవ. వీరి అధీనంలో ఉన్న ఒక గ్రామంలో సాంబశివుడి కుటుంబం, సాంబశివుడు ద్వారా హ్యారీ నీలి పంటను వ్యాప్తి చేసిన విధానం ఒక పక్క; తూర్పు బెంగాల్లో నీలి పంటపై రైతులు తిరగబడే విధానం.. దానికి వారు ఎదుర్కొన్న శిక్షలు.. ప్రజలను జాగృతం చేసే నాటకాలు రావడం, వాటిని ఫాదర్ ఫ్రాన్సిస్ లాంటి పాస్టర్లు సహాయ సహకారాలు అందించడం.. ఇదీ సూక్ష్మంగా ఇతివృత్తం.

బ్రిటిష్ కుటుంబాలు భారతదేశంలో తమ సంస్కృతిని విడవకుండా ఎలా జీవించేవి, వారి అభిరుచులు ఎలా ఉండేవి? ఈ నవల్లో చూడొచ్చు. ఇది నీలి పంటకు సంబంధించిన కథ కాబట్టి లూయిసా పాత్ర ద్వారా ఇక్కడి చేనేత అద్దకాల మాదిరి ప్రతులను సేకరించి స్క్రాచ్ బుక్కుగా తీర్చిదిద్దడం.. అలాంటి సరదా పనులు కూడా భవిష్యత్తులో బ్రిటీష్ వాణిజ్యానికి, భారతదేశ మార్కెట్‌ను అవగతం చేసుకోవడానికి ఉపయోగపడిన విధానం కథలో అంతర్లీనంగా వివరిస్తుంది ఈ నవల. భారతీయ రైతు కుటుంబాలు ఒకే మాట మీద ఉండే విధానం.. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ.., బ్రిటిష్ రాజ్ ద్వారా నూతన పోకడలను ఆస్వాదించి తమకు ఆపాదించుకునే వ్యక్తులకు ఉదాహరణగా సాంబశివుడు, పార్వతి పాత్రలను తీర్చిదిద్దే విధానం.. బ్రిటిష్ మాయలో పడకండి అని చివరి వరకు హెచ్చరించి జాతీయోద్యమ ఆలోచనలను రగుల్గొల్పిన చలపతి పాత్ర పాఠకులను ఆకట్టుకుంటాయి.

భారతీయ సాంప్రదాయ చేతివృత్తికి ప్రతినిధి నీలారి కనకయ్య పాత్ర. తన తాత ముత్తాతల నుంచి కళాత్మకంగా నేర్చుకున్న నీలిపంటను భరిణలకెత్తిన విధానం,. అది వస్త్రంపై అందమైన అద్దకంగా మలిచిన తీరు, నీలారి కనకయ్య వేరే పాత్రకు చెప్పినా చదువుతున్న మనలను ఆయన కుటీర పరిశ్రమలోకి తీసుకు వెళ్లి, ఆయనే మనకు చెపుతున్నాడా అన్నంత హృద్యంగా సాగుతుంది. ఇండిగో ప్లాంట్ల చేతిలో ఈ చేతి వృత్తుల వ్యవస్థ ఎలా చిన్నాభిన్నమైందో చూపడం మన హృదయాన్ని మెలి పెడుతుంది.



తూర్పు బెంగాల్ ప్రాంతంలో ఒక నేటివ్ రచయిత రాసిన 'నీలార్ణవం' నాటకం అనువాదం ద్వారా బ్రిటిష్ రాజ్ కోర్టులో నిలబడ్డ ఫాదర్ ఫ్రాన్సిస్. మతవ్యాప్తికి వచ్చిన బ్రిటిష్ పాస్టర్లు భారతీయుల్లో అక్షర జ్ఞానాన్ని పెంచి, మంచి చెడులను నింపిన వారికి ప్రతీకగా ఫాదర్ ఫ్రాన్సిస్ పాత్రను ఉదాహరణగా చెప్పవచ్చు. ఇంగ్లాండ్ నుంచి బయలుదేరిన ఓడలు ప్రతి 500 టన్నులకు ఒక పాస్టర్‌ని తీసుకువెళ్లాలి అనే నిబంధన ఉందంట. "మీ వారి ప్రవర్తనను బట్టి, వారి జీవన విధానాలను బట్టి, మీ మతాన్ని అంచనా వేస్తాం, మీ మత గ్రంథాలతో కాదు" అనే భారతీయుల ఆలోచనను అనుసరించి, పాస్టర్లు ధర్మాన్ని బోధిస్తే అది తమ వ్యాపారానికి ఎక్కడ అడ్డుకట్ట అవుతుందో అని 499 టన్నుల సరుకు మాత్రమే ఓడల్లో పంపించేవారు బ్రిటిష్ వర్తకులు. ఈ విషయాన్ని ఈ నవల ఎంత నాటకీయంగా చర్చించిందో..

బ్రిటిష్ రాజ్‌లో బ్రిటిష్ ఉద్యోగుల కోసం 'కాంట్రాక్ట్ వైఫ్ సిస్టం' దానికి ప్రతిఫలంగా జూలియా లాంటి బిడ్డలు.. అటు బ్రిటిష్ వాళ్లకు చెందక, ఇటు భారత సంతతికి చెందక మధ్యన నలిగిపోయే వ్యక్తులకు ప్రతీకలు ఈ జూలియాలు. అలాగే బ్రిటిష్ పురటాళ్ళు తమ బిడ్డలకు తగినంత పాలు ఇవ్వలేక, భారతీయ స్త్రీలను తమ బిడ్డలకు పాలిచ్చే దాదులుగా వాడుకునే విధానం, అందులో వారి భయాందోళనలు... దీనికోసం బ్రిటిష్ రాణి గారి యాక్ట్.. ఇలాంటి సూక్ష్మమైన విషయాలను కూడా ఈ నవల చర్చించింది.

"ప్రకృతితో సంభాషిస్తూ ఉండాలి. అదే నేర్పుతుంది అన్ని కిటుకులనూ" అంటూ శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో కాదు ప్రకృతి పరిశీలనలలోనే పుడతారు" అంటూ హ్యారి పాత్ర ద్వారా నీలిపంట రహస్యాలను వెలికి తీసే క్రమంలో రచయిత్రి నీలి పంట శాస్త్రజ్ఞురాలవుతారు. వీటిని వివరించే క్రమంలో, మన చుట్టూ ఉన్న పనుల్లో ఎంత శాస్త్రీయత దాగి ఉందో అర్థమయ్యాక ఒకింత పులకింతకు గురవుతాం.

పుస్తకం పేరు నీలంపు రాశి. ప్రతి పుటలోపూ నీలి పదాన్ని విడిచిపెట్టకుండా పాఠకులకు నీలంపై ఉన్న సమస్త జ్ఞానాన్ని అందిస్తారు రచయిత్రి. సముద్రంలో, ఆకాశంలో, ఇంద్రధనస్సులో, పక్షులలో ఇలా ప్రకృతిలో ఉన్న నీలిరంగును సందర్భానుసారంగా, మిక్కిలి సౌందర్యాత్మకంగా వివరిస్తారు. నవల సార్థక నామధేయి.

రచయిత్రి సాంప్రదాయ రైతు పక్షపాతి. అతడు లేకపోతే ఈ జీవకోటికి ఆహారం లేదన్న ఆరాధన భావం మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పుల్లయ్య కట్ట పులికాట్‌గా రూపాంతరం చెందడం వంటి ఎన్నో పదాల యొక్క పూర్వ నామాలు ఈ నవల వెలికి తీసింది. ఈ రచయిత్రి తెలుగు పదాలను ఎంత ఆత్మీయంగా వాడారో, పుస్తకంలో ఈ రచయిత్రి వాడిన శైలి చదివితే, తెలుగు భాషలో ఉన్న సౌందర్యం మరొక్కమారు ఎరుకలోకి వస్తుంది.

రచయిత్రి ఎన్ని విషయాలను సేకరించారో, నవలలో ఉండే ప్రాంతాలను ఎంత సూక్ష్మంగా పరిశీలించారో ప్రతి పుటలోనూ మనకు కనిపిస్తుంది. తను తెలుసుకున్న ప్రతి విషయం నవలలో మిక్కిలి నాటకీయంగా, సౌందర్యాత్మకంగా నిక్షిప్తం చేయడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో పాఠకుడు కొన్నిచోట్ల మిక్కిలి శ్రద్ధతో, ఏకాగ్రతగా చదవ వలసిన అవసరం ఏర్పడింది. ఈ నవలలో వెతుకుదామన్నా చిన్న అక్షర దోషం కనిపించదు. ఆనాటి చారిత్రక సాక్ష్యాలుగా ఉన్న బొమ్మలు సందర్భానుసారం ఈ పుస్తకంలో నిక్షిప్తం చేశారు. ఎంతో శ్రమదమాదులుకోర్చి రాసిన ఈ నవలను తెలుగు భాష సంస్కృతి ఆరాధకులందరూ చదవదగ్గది.

– డాక్టర్ ఆల్తి మోహన రావు
99638 95636

మే 4న ఉమ్మడిశెట్టి అవార్డుల ప్రదానోత్సవం

మే 4వ తేదీ ఆదివారం నాడు కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ఉమ్మడిశెట్టి అవార్డుల ప్రదానోత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఉమ్మడిశెట్టి సత్యాదేవి అవార్డును కవయిత్రి వైష్ణవి శ్రీ కి, ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ జాతీయ యువ పురస్కారాన్ని యువకవి నందకిషోర్‌కు, డాక్టర్ రాధేయ కవితా పురస్కారాన్ని కవయిత్రి సుధామురళికి అందజేస్తారు. ఈ కార్యక్రమములో డాక్టర్ రాధేయ, నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, అద్దేపల్లి ప్రభు, మానస చామర్తి పాల్గొంటారు. డాక్టర్ పెళ్లూరు సునీల్, డాక్టర్ సుంకర గోపాలయ్య, దోర్నాదుల సిద్ధార్థ, డాక్టర్ అంకె శ్రీనివాస్ సభను నిర్వహిస్తారు.

– ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్, అనంతపురం

1న సోమేపల్లి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం సంయుక్తంగా కీ.శే. సోమేపల్లి వెంకటసుబ్బయ్య గారి జయంతి, సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం మే 1, 2025, గురువారం సాయంత్రం 5 గంటలకు గుంటూరు బ్రాడీపేటలో గల కొరటాల భవన్‌లో జరుగుతుంది. ఈ సభకు చలపాక ప్రకాష్ అధ్యక్షత వహిస్తారు. డా. పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారు. డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు ఆత్మీయ అతిథిగా పాల్గొంటారు. కార్యక్రమంలో భాగంగా కందిమళ్ళ శివప్రసాద్ సోమేపల్లి సాహిత్య పరిచయాన్ని, నానా సోమపల్లి వ్యక్తిత్వాన్ని గురించి తెలియజేస్తారు. కథా పురస్కారం సి. యమునకు (రెక్కలొచ్చాయి), కవితా పురస్కారం ఖాదర్ షరీఫ్‌కు (జీవ రహస్యలిపి) అందజేయబడతాయి. ఈ కార్యక్రమాన్ని ఎస్.ఎం.సుభాని, శ్రీ వశిష్ఠ సోమేపల్లి నిర్వహిస్తారు.

కథల పోటీకి మంచి స్పందన; రచయితలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి సాహితి సంస్థ ప్రకటించిన కథల, పాటల పోటీకి మంచి స్పందన లభించింది. గడువు ముగిసే సమయానికి సుమారు 300 కథలూ, 200 పాటలూ వచ్చాయి. శనివారం వరకూ పోస్టులో, ఆదివారం వరకూ ఈమెయిల్లో అందిన రచనలను పరిగణనలోకి తీసుకున్నాము. ప్రాథమిక వడపోత తరువాత మొత్తం కథలను, పాటలను ముగ్గురు స్థాన నిర్ణేతలకు పంపిస్తాము. త్వరలో ఫలితాలు ప్రకటిస్తాము. కథలూ పాటలూ పంపిన రచయితలూ, రచయిత్రులు అందరికీ ధన్యవాదాలు.

– ప్రజాశక్తి సాహితీ సంస్థ.

తమిళనాడులో ఇద్దరు మంత్రుల రాజీనామా


కె పొన్ముడి


వి సెంథిల్ బాలాజీ

చెన్నై : తమిళనాడులో ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రభుత్వ మంత్రివర్గంలో ఇద్దరు మంత్రులు ఆదివారం రాత్రి రాజీనామా చేశారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి కె పొన్ముడి, రాష్ట్ర విద్యుత్, ప్రొబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి వి సెంథిల్ బాలాజీలు తమ పదవులకు రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపాదన మేరకు వీరి రాజీనామాలను గవర్నరు ఆర్ఎన్ రవి ఆమోదించినట్లు రాజ్‌భవన్ ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే మాజీ మంత్రి మనో తంగరాజ్‌ను కేబినెట్‌లో చేర్చుకోవాలని స్టాలిన్ ప్రతిపాదించారు. రాజ్‌భవన్‌లో ఈ నెల 28న సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజీనామాల అనంతరం పొన్ముడి నిర్వహించిన అటవీ శాఖ బాధ్యతలను పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్‌కు విద్యుత్ శాఖ బాధ్యతలను రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్‌కు, ప్రొబిషన్, ఎక్సైజ్ శాఖను గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్ ముత్తుస్వామికి అదనంగా అప్పగించారు. పొన్ముడి, సెంథిల్ బాలరాజ్‌కు వ్యతిరేకంగా తీవ్ర కేసులు నమోదు కావడంతో, మంత్రిపదవుల్లో కొనసాగడంపై న్యాయస్థానం ఆక్షేపణలు వ్యక్తం చేసిన నేపథ్యంలో వారు ఇరువురు రాజీనామా చేయాల్సివచ్చింది.

కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న భద్రతా దళాలు

- విశాల మానవ నిర్మిత సొరంగాన్ని గుర్తించిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టలను భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. దండకారణ్యంలో అనుకూల పరిస్థితులు లేకపోవడంతో కర్రెగుట్టలకు మావోయిస్టు అగ్ర నేతలు తరలివెళ్లినట్లు నిఘావర్గాల సమాచారంతో గత ఆరు రోజులుగా పోలీసు బృందాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. కర్రెగుట్టలను అన్నివైపుల నుంచి చుట్టుముట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలు ఆదివారం భారీ సొరంగాన్ని గుర్తించాయి. వెయ్యి మంది తలదాచుకునేందుకు వీలుగా దీని నిర్మాణం ఉందని తెలుస్తోంది. లోపల పెద్ద మైదానంతోపాటు నీటి వసతి, ఇతర సౌకర్యాలు ఉన్నట్లు సమాచారం. కొన్ని నెలలపాటు మావోయిస్టులు ఈ సొరంగంలోనే ఉన్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి.

కొండల్లో పెద్ద సంఖ్యలో ఉన్న మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్‌కు గురయ్యారని, వారి పరిస్థితి విషమంగా మారుతోందని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. మరోవైపు నిరంతరం జరుగుతున్న ఈ ఆపరేషన్ కారణంగా మావోయిస్టులు ఇప్పుడు ఆహారం కోసం ఇబ్బందులు పడుతూ ఉండొచ్చని చెబుతున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దును కేంద్రంగా చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకొని భీమారంపాడు, కస్తూరిపాడు, చినఉట్లపల్లి, పెదఉట్లపల్లి, పూజారికాంకేర్, గుంజపర్తి, నంబి, ఎలిమిడి, నడిపల్లి, గల్గంలో ప్రధానంగా ఆపరేషన్ కొనసాగుతోంది. రుద్రారం వరకు 90 కిలో మీటర్ల పొడవున ఉన్న కర్రెగుట్టలను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు వేల సంఖ్యలో బలగాలు జల్లెడ పడుతూ కొండలపైకి చేరుకుంటున్నాయి. ఇప్పటి వరకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలు, ఆయుధాలు, పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. శనివారం కర్రెగుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భారీ సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందినట్లు ప్రచారం సాగినప్పటికీ అధికారులు ఇప్పటి వరకు నిర్ధారించలేదు. ఇదిలాఉంటే, తెలంగాణ సరిహద్దుల్లో పరిస్థితులపై డిజిపి జితేందర్ ఆదివారం సరిహద్దు జిల్లాల ఎస్‌పిలు, నిఘా విభాగం అధికారులతో సమీక్షించారు. సరిహద్దు రాష్ట్రాల పోలీసులు, కేంద్ర హోం శాఖతో టచ్‌లో ఉండాలని సూచించారు. సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని, విఐపిల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీనియర్ ఐపిఎస్‌లకు సూచించారు.

దేనికైనా సిద్ధం

- నావికా దళం ప్రకటన

న్యూఢిల్లీ : 'ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా సరే..' తాము అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్నామని భారత నావికా దళం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆదివారం పోస్టు చేసింది. సరిహద్దులో ఉద్రికత్తల నేపథ్యంలో నావికా దళం ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఈ క్రమంలోనే అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను నేవీ ఆదివారం పరీక్షించింది. సముద్ర జలాల్లో ఎప్పుడైనా.. ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు ఇండియన్ నేవీ సిద్ధమని తెలిపింది. మూడ్రోజుల క్రితమే భారత్ ఇదే సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎంఆర్-ఎస్ఏఎం)తో సీ స్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించింది. గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీ స్కిమ్మింగ్ టార్గెట్‌లుగా పేర్కొంటారు.

స్వల్పకాలిక వీసాదార్లకు ముగిసిన గడువు

- పాకిస్తాన్‌కు తిరిగివెళ్లిన 537 మంది

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాకిస్తాన్‌తో సరిహద్దును మూసివేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం స్వల్పకాలిక వీసాలున్న వారికి కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు ఈ నెల 27 (ఆదివారం)తో ముగిసింది. దీంతో ఇప్పటివరకు 537 మంది పాక్ జాతీయులు అట్టారీ-వాఘా సరిహద్దు మార్గంలో పాక్ వెళ్లిపోయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వీరిలో తొమ్మిది మంది దౌత్యవేత్తలు, అధికారులు ఉన్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 24 నుంచి భారత్‌లో ఉన్న పాకిస్థానీయులు దేశం వీడటం ప్రారంభించారు. తొలి మూడు రోజుల్లో పరిమిత సంఖ్యలో వెళ్లిపోగా.. ఆదివారం ఒక్కరోజే 287 మంది పాక్ జాతీయులు వెళ్లిపోయారు. కొంతమంది ఎయిర్‌పోర్టుల ద్వారా వెళ్లే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అయితే, పాకిస్థాన్‌కు నేరుగా విమాన సర్వీసులు లేనందున ఇతర దేశాలకు వెళ్లి.. అక్కడ నుంచి పాక్‌కు వెళ్లిపోయి ఉండవచ్చని సరిహద్దులో ఉన్న ప్రొటోకాల్ అధికారులు వెల్లడించారు. అయితే అట్టారీ సరిహద్దు ద్వారా 850 మంది భారతీయులు పాకిస్థాన్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చినట్లు చెప్పారు.

వెళ్లకపోతే మూడేళ్ల జైలు, రూ.3 లక్షల జరిమానా!

స్వల్పకాలిక 'సార్క్' వీసాదారులకు ఈ నెల 26నే గడువు ముగిసింది. మెడికల్ వీసాలు ఉన్నవారికి ఈ నెల 29 వరకు ఉంది. ఇక వీసా ఆన్ అరైవల్, బిజినెస్, ఫిల్మ్, జర్నలిస్ట్, ట్రాన్సిట్, స్టూడెంట్, విజిటర్ తదితర 12 విభాగాల వీసాదారులకు ఈ నెల 27 ఆదివారంతో గడువు ముగిసింది. కేంద్ర ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో ఉన్న పాకిస్థానీయులందర్నీ గుర్తించామని, వారిని తిరిగి పంపించేందుకు ఏర్పాట్లు చేశామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. మీడియాలో వస్తున్నట్లుగా ఎవ్వరూ తప్పిపోలేదన్నారు. రాష్ట్రంలో 5050 మంది పాక్ జాతీయులు ఉండగా.. వారిలో స్వల్పకాలిక వీసాతో వచ్చిన వెయ్యి మందిని వెళ్లిపోవాలని చెప్పామన్నారు.

- తెలంగాణలో 208 మంది పాక్ జాతీయులు ఉండగా.. వారిలో 156 మంది దీర్ఘకాలిక, 13 మంది స్వల్పకాలిక వీసాలు కలిగి ఉన్నారని డీజీపీ జితేందర్ వెల్లడించారు. మరో 39 మంది వైద్య, బిజినెస్ వీసాలపై వచ్చారని చెప్పారు.
- మధ్యప్రదేశ్‌లో 228 మంది ఉండగా.. వారంతా ఇప్పటికే వెళ్లిపోయినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఏప్రిల్ 30లోగా పాక్ జాతీయులను వెనక్కి పంపించే ప్రక్రియను పూర్తిచేస్తామని ఉత్తరప్రదేశ్ డిజిపి వెల్లడించారు.
- కేరళలో 104 మందికిగాను 99 మంది దీర్ఘకాలిక వీసా కలిగి ఉన్నారని, మిగతా ఐదుగురు టూరిస్టు లేదా మెడికల్ వీసా ఉన్నవారు ఇప్పటికే దేశం విడిచి వెళ్లారని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.
- బీహార్‌లో ఉన్న 19 పాక్ జాతీయులంతా గడువులోగా వెళ్లిపోయినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.
- ఒడిశాలో 12 మంది, గోవాలో ముగ్గురు, గుజరాత్‌లో ఏడుగురు పాకిస్థానీయులు ఉండగా.. గడువులోగా స్వదేశానికి వెళ్లిపోవాలని సూచించినట్లు ఆయా ప్రభుత్వాలు పేర్కొన్నాయి. అయితే, గుజరాత్‌లో 438 మంది భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వ అధికారులు తెలిపారు.

పారిశుధ్య కార్మికుడు మరణిస్తే కుటుంబానికి రూ.30 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

శుభ్రపరుస్తూ మరణించిన వారి లెక్కలను 1993 నుంచి నేటి వరకు వెలికి తీయాలని పేర్కొంది. కార్మిక సంఘాలకు లేఖలు రాసి వారి నుంచి కూడా సమాచారం తెప్పించుకోవాలని ఆదేశించింది. తద్వారా వారి కుటుంబీకులకు పరిహారం చెల్లింపు, తగిన పునరావాస కల్పనకు ఆదేశాల జారీకి వీలవుతుందని తెలిపింది. మరణించిన పారిశుధ్య కార్మికులు ఎవరి ఆధ్వర్యంలో పనిచేసే వారో, వాళ్ల ఏజెన్సీలు ఏమిటో వివరాలు కూడా సేకరించాలని ఆదేశించింది. ఈ వివరాలు అందిన తర్వాత మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించేలా పూర్తి స్థాయిలో ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. వీటిని రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, ఇతర స్థానిక సంస్థల నుంచి ఆ పురపాలక శాఖ కమిషనరు సేకరించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

పారిశుధ్య కార్మికుల మృతికి బాధ్యులను చేస్తామని అధికారులకు హెచ్చరిక

కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, ఇతర స్థానిక సంస్థల అధికారులను కూడా పారిశుధ్య కార్మికుల మృతికి బాధ్యులను చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. ఆ అధికారుల సర్వీసు రిజిస్టరులో రిమార్కులు రాసేలా ఉత్తర్వులు జారీ చేస్తామని, భవిష్యత్‌లో వారు ప్రమోషన్స్ పొందాలని అనుకునేటప్పుడు సంజాయిషీ చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొంది.

కెనడాలో జనంపైకి దూసుకెళ్లిన కారు

- 11 మంది మృతి

ఒట్టావా : కెనడాలోని వాంకోవర్‌లో వేడుక జరుపుకుంటున్న జనంపైకి కారు దూసుకెళ్లడంతో 11 మంది చనిపోయారు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటన స్థానిక కాలమానం ప్రకారం.. శనివారం రాత్రి 8.00 గంటల సమయంలో జరిగిందని పోలీసులు తెలిపారు. లాపు-లాపు వేడుక సందర్భంగా పలువురు ఫిలిప్పీన్స్ కమ్యూనిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో వాంకోవర్‌లోని ఇ-41 అవెన్యూ మరియు ఫ్రాసర్ వీధికి చేరుకున్న సమయంలో ఈ ఘటన జరిగింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా లేదా దాడి జరిగిందా అన్న అంశాన్ని అధికారులు నిర్ధారించాల్సి వుంది. నల్లటి ఎస్‌యువి కారు వేడుక కోసం అక్కడికి చేరిన జనసమూహంపై దూసుకువచ్చిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. డ్రైవర్ మానసిక వికలాంగుడిగా కనిపించినట్లు వెల్లడించారు.



మీకోసం

పెనానికి పట్టిన జిడ్డు వదలాలంటే దానిని రెండు మూడు గంటలపాటు వేడినీళ్లలో ఉంచి తర్వాత నిమ్మచెక్కతో రుద్దాలి.

జీవన సౌరభం

కెరటాన్ని ఆదర్శంగా తీసుకో.. లేచి పడుతున్నందుకు కాదు.. పడి లేస్తున్నందుకు.

పిల్లలూ, జాగ్రత్త!



ఎండలు మండుతున్నాయి
వడగాల్పులు వీస్తున్నాయి
పిల్లలూ బయటికి రాకండి
వడదెబ్బకు గురి కాకండి

నీటి కుంటలో నీరేది?
బావులు, చెరువులో నీటి జాడేది?
పొలాలు బీడు వారాయి
మొక్కలు వాడిపోయాయి

పక్షులు/ జంతువులకు నీరు పెడదాము
మొక్కలకు నీరు పోద్దాము

ఫ్రిజ్ నీళ్లొద్దు
కూల్ డ్రింకులు మనకొద్దు
పిజ్జాలు బర్గర్లు అసలొద్దు
అనారోగ్యానికి గురి కావద్దు

నిమ్మకాయ నీళ్లు తాగుదాము
పుచ్చకాయ ముక్కలు తిందాము
కొబ్బరి నీళ్లు కావాలి
సబ్జా నీరు తాగాలి
ఎర్ర/ నల్ల కుండను కొందాము
చల్లని నీరు తాగుదాము
ఆరోగ్యంగా ఉందాము
అందరికీ ఇది చెబుదాము

– ఏడుకొండలు కళ్ళేపల్లి,
మచిలీపట్నం, 94908 32338.



సరైన నీడ ఏది?

పిల్లలూ, రవి తన కుక్కపిల్లతో బయటకు వెళుతున్నాడు. ఎదురుగా కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో తన సరైన నీడను కనిపెట్టండి.

జవాబు : 4

నేను గీసిన బొమ్మ





ఘజాల,
8వ తరగతి,
ఎస్‌కెవిటి ప్రభుత్వ హైస్కూలు,
రాజమహేంద్రవరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కూచిపూడికి వన్నె వేదాంతం రాధేశ్యామ్...

కూచిపూడి నాట్యమంటేనే వైవిధ్యభరితం. అందులో నృత్యరీతులు హృద్యంగా సాగుతుంటాయి. సంగీతానికి తోడు సాహిత్యంతో కూడిన పాటలు సాగుతుంటే గజ్జె కట్టిన కళాకారులు తాండవమాడతారు. అలాంటి కళాకారుడిగా రాధేశ్యామ్ స్టేజ్ ఎక్కితే నృత్యంతో ఎవరైనా నృత్యంలో లీనమై పరవశించాల్సిందే. నృత్యరీతులు, హావభావాలు, ఔరా అనిపించాల్సిందే. సౌందర్యవంతమైన రూపంతో ప్రదర్శనలు, నట్వాంగంతో హావభావాలు, విభిన్నమైన పాత్రలను పోషించి అలరించారు. ఐదు దశాబ్దాలుగా ఆయన కూచిపూడి కళను భావితరాలకు అందిస్తూ వేలాదిమంది కళాకారులను తీర్చిదిద్దారు. ఆయన వద్ద శిష్యరికం చేసిన వారు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున అవార్డులను సైతం కైవసం చేసుకుంటున్నారు. ఆయన అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు.



వేదాంతం రాధేశ్యామ్ కృష్ణాజిల్లా మొవ్వ మండలం కూచిపూడిలో వేదాంతం సూర్యనారాయణ, సత్యవతమ్మ దంపతులకు జన్మించారు. చిన్న వయసులోనే కూచిపూడి నృత్యాన్ని కుటుంబ వారసత్వంగా తీసుకున్నారు. వేదాంతం పార్వతీశం, వేదాంతం సీతారామశాస్త్రి, వెంపటి పెద్ద సత్యం, వెంపటి చినసత్యం, పివిజి కృష్ణ శర్మ, వై.సీతారామాంజనేయులు, భాగవతుల సత్య సుందర రామశాస్త్రి, బొక్కా కుమార స్వామి, వేదాంతం సత్యనారాయణ శర్మ, సినీ నృత్యదర్శకులు పసుమర్తి కృష్ణమూర్తిల వద్ద నాట్య, నృత్యరీతులను నేర్చుకున్నారు. నాగార్జున యూనివర్శిటీ ద్వారా ఎంఎ తెలుగు పూర్తిచేశారు. అనంతరం హిందీ, సంస్కృత భాషల్లోనూ ప్రవీణులయ్యారు. ఆగిరిపల్లిలో తెలుగు భాషా ప్రవీణ ఆరేళ్లు, ప్రొద్దుటూరులో ఏడాదిపాటు తెలుగు పండిట్ ట్రైనింగ్ పూర్తిచేశారు. కూచిపూడి నృత్యంలో డిప్లమో (ఆనర్స్) పొందారు. తొలుత పామర్రులో తెలుగు ఉపాధ్యాయులుగా రెండేళ్లపాటు పనిచేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం కూచిపూడి శ్రీ సిద్దేంద్ర కళాశాలలో రాష్ట్రప్రభుత్వం తరపున కళాశాల ప్రారంభం కావటంతో అక్కడ మొదట్లో నృత్య అధ్యాపకునిగా చేరి ఎందరినో ఈ కళలో ప్రోత్సహించి నిపుణులుగా తయారుచేశారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా కూడా వ్యవహరించారు. ఆట, పాట, మాట, పద్యం వంటి కళల్లో శిక్షణ ఇచ్చారు. స్త్రీ, పురుష వేషాలను ధరించి పాటలు పాడుతూ సందర్భానుసారంగా నృత్యరీతులు పాటిస్తూ కళారూపాల ప్రదర్శనలు ఇవ్వటంలో ఆయన దిట్ట. కువైట్, సింగపూర్, యుఎస్ఎ తదితర ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలకు దర్శకత్వం వహించటమే కాకుండా తనే అనేక ప్రదర్శనల్లో నర్తించటం, కొన్నింటికి న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించారు. అనతికాలంలోనే అసాధారణ కూచిపూడి కళాకారుడిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

కర్నాటక రాష్ట్రప్రభుత్వం ఆయన్ను కూచిపూడి టెక్స్‌బుక్ కమిటీకి చైర్మన్‌గా నియమించింది. 2000లకుపైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చి ఆయన ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశారు. ఆయన నాట్య కళాకారుడే కాకుండా స్వతహాగా నృత్యరీతులపై పాటలు పాడటంలో దిట్ట. నృత్యరీతులతో ప్రేక్షకులను సమ్మోహనం చేయటం ఆయనకున్న సహజ నైపుణ్యం. చక్కటి వాక్చాతుర్యం, నృత్యరీతుల్లో స్పష్టత ఆద్యంతం తొణికిసలాడుతుంటాయి. దేశ విదేశాల్లో జరిగిన నృత్య ప్రదర్శనల్లో ఆయన స్వయంగా నాట్యరీతులను ఆచరించటంతోపాటుగా తన శిష్యులతో ఇచ్చిన ప్రదర్శనలు సైతం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నిలిచాయి.

నిరంతరం కళామతల్లి సేవలోనే...

ఉద్యోగ విరమణ తర్వాత నుంచి తన ఇంటి వద్దే 'కూచిపూడి నాట్య శిల్పారామం' ఏర్పాటుచేసి ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నారు. విజయవాడ ఆలిండియా రేడియోకు కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకశాఖ, సాంస్కృతిక శాఖ ద్వారా ఉగాది పురస్కారాల ఎంపిక కమిటీలో సభ్యులుగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాంస్కృతిక చైర్మన్ ఛాంబర్‌లో సబ్‌కమిటీ సభ్యులుగా కూడా పనిచేశారు. హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేశారు. నృత్య పోటీల్లో న్యాయనిర్ణేతగా పలు యూనివర్శిటీలు ఆహ్వానిస్తున్నాయి.

పోషించిన పాత్రలివే...


ఛండాలిక నృత్య నాటకంలో బౌద్ధ బిక్షువు, క్షీర సాగర మథనంలో అప్సరస శుక్రాచార్య, నట్వాంగం. హరవిలాపంలో ప్రమథుడు, ప్రహ్లాద నాటకంలో ప్రహ్లాదుడు, నిర్వాహక సూత్రధారి, హిరణ్య కశ్యప, ఉషా పరిణయంలో చిత్రలేఖ, సూత్రధారి, శ్రీకృష్ణ పారిజాతంలో నారదుడు, రుక్మిణీ కళ్యాణంలో అగ్ని జ్యోతన, శ్రీనివాస కళ్యాణంలో రుషి సుఖ మహర్షి, గొల్లవాడు, గొల్ల కలాపంలో గొల్లభామ, సూత్రధారిలో సోమయాజి, శ్రీకృష్ణ విజయంలో సూత్రధారి, భామాకలాపంలో భామ, శ్రీకృష్ణుడు, మాధవి, విప్రనారాయణలో కావేరీ, అర్చకస్వామి తిలోత్తమలో రాజు సుంద, పార్వతీకళ్యాణంలో పార్వతి, సూత్రధారి వంటి పాత్రలను పోషించారు. నాట్యము, నృత్తము, నృత్యం వ్యస్త నృత్యాంశాలు చేయిస్తూ ప్రోత్సహిస్తున్నారు. 'కూచిపూడి భాగవతుల చరిత్ర పుటలు' అనే పుస్తకాన్ని ఆయన రచించారు. సిద్దేంద్ర యోగిపై టెలీఫిల్మ్‌ను తీయగా అందులో సూత్రధారి వేషంలో అలరించారు. ఆయన ప్రతిభను గుర్తించిన దూరదర్శన్ సంస్థ ప్రతినిధులు ఎటాప్ హోల్డర్‌గా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు, కేంద్ర సంగీత నాటక అవార్డు, అకాడమీ ఆఫ్ యూనివర్శల్ గ్లోబల్ పీస్ ద్వారా గౌరవ డాక్టరేట్ పొందారు. 'కూచిపూడిలో సూత్రధారీ విధానం (యువ హాస్యకారి)'పై రెండేళ్లపాటు ఫెలోషిప్ (తంజావూరు) చేశారు.

– యడవల్లి శ్రీనివాసరావు

ప్రోత్సహిస్తే మరింతగా ...

ప్రాచీన కూడిపూచి నృత్యం నేడు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా వేదికలపై సాక్షాత్కరిస్తోంది. ఈ నృత్యరీతులు మరుగున పడిపోకుండా ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహాన్ని అందించాలి. కూచిపూడి నాట్యాన్నే సర్వస్వంగా ఎంచుకున్న కళాకారులకు జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూడాలి. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో ఒక సబ్జెక్టును ప్రవేశపెట్టి అందులో నిష్ణాతులైన వారికి ఉద్యోగ అవకాశాలు వచ్చేలా చూడాలి. వృద్ధ కళాకారులకు జీవన భృతికి ఇబ్బంది లేకుండా పారితోషికాలు ఇవ్వాలి.

– వేదాంతం రాధేశ్యామ్,
రాష్ట్రపతి అవార్డు గ్రహీత



'ఉగ్ర' ఆంక్షలతో సామాన్యులకు ఇక్కట్లు

అట్టారి సరిహద్దు మూసివేయడంతో తెగిపోతున్న బంధాలు

న్యూఢిల్లీ : భారత్, పాకిస్తాన్ సమన్వయం పాటించాలని ఐక్యరాజ్యసమితి కోరుతోంది. సరిహద్దు వెంబడి ఒకవైపు పాకిస్తాన్ బలగాలు కాల్పులు కొనసాగిస్తుండటం, మరోవైపు పహల్గాం ఉగ్రదాడి అనంతరం కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు వెరసి ఇరు దేశాలకు చెందిన సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రక్తబంధాలను తెంచేస్తున్నాయి. బంధుబలగాన్ని దూరం చేస్తున్నాయి. పాక్ పౌరులు తక్షణమే దేశం విడిచి వెళ్లాలని కేంద్రం విధించిన డెడ్‌లైన్ ముగుస్తోంది. రాష్ట్రాల్లో ఉన్న వారిని వెతికి మరీ పంపేందుకు కేంద్రం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఆయా కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ..తమ వారికి దూరమవుతున్న పేగుబంధాలు అత్తారి సరిహద్దులో సాక్షాత్కరిస్తున్నాయి. గతంలో

పాకిస్తాన్‌కు చెందిన కొన్ని కుటుంబాలు భారత్‌కు వచ్చాయి. అయితే పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలు వారిని విడదీశాయి. దీంతో భారతీయ పౌరులైన తల్లులను పాక్ పౌరసత్వం ఉన్న పిల్లలు భారంగా విడిచివెళ్లాల్సి వచ్చింది. పాకిస్తాన్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్, భారత్‌కు చెందిన నబీలాకు చాలా ఏళ్ల కిందట వివాహం జరిగింది. ఢిల్లీలో ఉన్న తల్లిని చూసేందుకు నబీలా తన భర్త, పిల్లలతో కలిసి భారత్ వచ్చింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ పౌరులు తిరిగి వెళ్లాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు తల్లీ పిల్లలను విడదీశాయి.


అట్టారి సరిహద్దు వద్ద రోదిస్తున్న మహిళలు

నబీలాకు భారత పాస్‌పోర్ట్ ఉండటంతో ఆమె పాక్ తిరిగి వెళ్లేందుకు అధికారులు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో పాక్ పౌరులైన 11 ఏండ్ల జైనబ్, 8 ఏండ్ల జెనీష్ తమ తల్లిని భారంగా వీడారు. తండ్రి మహ్మద్ ఇర్ఫాన్‌తో కలిసి పంజాబ్ సరిహద్దు మీదుగా పాకిస్తాన్‌కు తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు పిల్లలు తమ తల్లిని విడిచి వెళ్లడంపై కన్నీటి పర్యంతమయ్యారు.

ఇలాంటి కుటుంబాలెన్నో..

మహ్మద్ ఇమ్రాన్, షర్మీన్ దంపతులు 18 ఏండ్లుగా పాకిస్తాన్‌లోని కరాచీలో నివసిస్తున్నారు. తమ కుమార్తెలతో కలిసి వారు భారత్‌కు వచ్చారు. షర్మీన్‌కు భారత పాస్‌పార్ట్ ఉండటంతో పాక్ తిరిగి వెళ్లేందుకు ఆమెను అనుమతించలేదు. దీంతో పాక్ పౌరసత్వం ఉన్న కుమార్తెలను తీసుకుని ఇమ్రాన్ ఆ దేశానికి తిరిగి వెళ్లాడు. తల్లి షర్మీన్‌ను అధికారులు అనుమతించకపోవడంతో ఆమె పిల్లలు భావోద్వేగం చెందారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో తల్లీబిడ్డలను విడదీయడం తగదని పాక్ కుటుంబాలు వాపోయాయి.

రక్షణమంత్రితో సిడిఎస్ భేటీ

న్యూఢిల్లీ : భారత్–పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆదివారం కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ భేటీ అయ్యారు. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భద్రతా దళాలు తీసుకుంటున్న చర్యలు, సరిహద్దులో ప్రస్తుత పరిస్థితుల గురించి చర్చించినట్లు తెలిసింది. మరోవైపు బిఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దిల్జిత్ సింగ్ చౌధరీ కూడా నార్త్ బ్లాక్‌కు చేరుకున్నారు. ఈ వరుస భేటీలకు ప్రాధాన్యం సంతరించుకుంది.

కాగా పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమిస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు.

ఇదే సమయంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘిస్తోందని, నియంత్రణ రేఖ వెంట దాడులకు పాల్పడుతోందని, పాక్ చర్యలను భారత సైన్యం దీటుగా తిప్పికొడుతోందని కూడా కథనాలు వెలువడుతున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పారామిలిటరీ, సైన్యానికి ఇచ్చిన సెలవులు రద్దు చేసి, వెంటనే తిరిగి రావాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అటు జమ్మూ కశ్మీర్‌లోనూ భారీగా సైన్యాన్ని మోహరించారు.

పహల్గాం దాడిని ఖండించిన ఎఫ్‌బిఐ

వాషింగ్టన్ : జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల జరిపిన దాడిని అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) తీవ్రంగా ఖండించింది. ఆదివారం ఈ మేరకు ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత ప్రభుత్వానికి నిరంతరం అమెరికా పూర్తి మద్దతుగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ దాడి ఉగ్రదాదుల నుండి ప్రపంచం ఎదుర్కొంటున్న ముప్పుకి చిహ్నమని పేర్కొన్నారు. ఉగ్రదాడి బాధితులందరికి ఎఫ్‌బిఐ తరపున ఆయన సంతాపాన్ని ప్రకటించారు.

ఎదురులేని ముంబయి

- హార్దిక్ సేనకు వరుసగా ఐదో విజయం
- నిప్పులు చెరిగిన పేస్ ద్వయం బుమ్రా, బౌల్ట్
- సూపర్‌జెయింట్స్‌పై 54 పరుగులతో గెలుపు

ఐదు మ్యాచుల్లో ఒక్క విజయమే సాధించిన ముంబయి ఇండియన్స్ ఇప్పుడు ఐదు మ్యాచుల్లో ఐదు విజయాలతో దూసుకెళ్తోంది. వాంఖడెలో లక్నో సూపర్‌జెయింట్స్‌పై ముంబయి ఇండియన్స్ 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపిఎల్ లీగ్ దశలో సూపర్‌జెయింట్స్‌పై ముంబయి ఇండియన్స్‌కు ఇదే తొలి విజయం కావటం విశేషం. ఓవరాల్‌గా ఆరో విజయంతో పాయింట్ల పట్టికలో ముంబయి ఇండియన్స్ రెండో స్థానానికి ఎగబాకింది.



ముంబయి : లీగ్ దశలో లక్నో సూపర్ జెయింట్స్ గండాన్ని ముంబయి ఇండియన్స్ ఎట్టకేలకు అధిగమించింది. ఐపీఎల్‌లో ఇప్పటివరకు లీగ్ దశలో ఆరు సార్లు తలపడిన ముంబయి ఇండియన్స్ ఏ మ్యాచ్‌లోనూ గెలుపు గీత దాటలేదు. బ్యాట్‌తో, బంతితో భీకర ఫామ్‌లో ఉన్న హార్దిక్‌సేన ఆదివారం వాంఖడెలో సూపర్‌జెయింట్స్‌కు షాక్ ఇచ్చింది. విజయంపై కన్నేసి ముంబయికి వచ్చిన లక్నో భారీ పరాజయం మూటగట్టుకుంది. 216 పరుగుల ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 161 పరుగులకు కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (34, 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (27, 15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఆయుశ్ బదాని (35, 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), డెవిడ్ మిల్లర్ (24, 16 బంతుల్లో 3 ఫోర్లు) మెరిసినా.. ఆ జట్టుకు 54 పరుగుల తేడాతో ఓటమి చెందింది. ముంబయి పేసర్లు జశ్‌ప్రీత్ బుమ్రా (4/22), ట్రెంట్ బౌల్ట్ (3/20), స్పిన్నర్ విల్ జాక్స్ (2/18) తొమ్మిది వికెట్లు పడగొట్టి లక్నో పతనాన్ని శాసించారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 215 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ రియాన్ రికెల్టన్ (58, 32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (54, 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కగా.. నమన్ ధిర్ (25 నాటౌట్, 11 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కార్బిన్ బాచ్ (20, 10 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించిన విల్ జాక్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. అగ్రశ్రేణి పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా మరో ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ తరపున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా లసిత్ మలింగ (170) రికార్డును అధిగమించిన బుమ్రా 174 వికెట్లతో ముందంజ వేశాడు.



పేస్ త్రయం నిప్పులు : లక్నో సూపర్‌జెయింట్స్‌ను ముంబయి ఇండియన్స్ పేస్ త్రయం విలవిల్లాడించింది. జశ్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, కార్బిన్ బాచ్‌లు సూపర్‌జెయింట్స్ బ్యాటర్లకు ముకుతాడు వేశారు. బౌల్ట్, బుమ్రా, బాచ్ త్రయం 12 ఓవర్లలో 8 వికెట్లు పడగొట్టి.. కేవలం 68 పరుగులే ఇచ్చింది. ఇక్కడే మ్యాచ్ ముంబయి ఇండియన్స్ చేతుల్లోకి వెళ్లి పోయింది. స్పిన్నర్ విల్ జాక్స్ (2/18) సైతం వికెట్ల వేటలో జత కలవటంతో సూపర్‌జెయింట్స్ చేష్టలుడిగింది. 20 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌటైంది. భారీ ఛేదనలో సూపర్‌జెయింట్స్ ఆరంభంలో రేసులోనే నిలిచింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (34), నికోలస్ పూరన్ (27) దూకుడుగా ఆడారు. ఓపెనర్ ఎడెన్ మార్క్రామ్ (9) నిరాశపరిచినా.. పవర్‌ప్లేలో సూపర్‌జెయింట్స్ 60/1 పరుగులు చేసింది. కానీ మిడిల్ ఆర్డర్‌లో కీలక బ్యాటర్లు తేలిపోయారు. కెప్టెన్ రిషబ్ పంత్ (4) వైఫల్య వ్యథను కొనసాగించగా..అబ్దుల్ సమద్ (2), డెవిడ్ మిల్లర్ (24), ఆయుశ్ బదాని (35) అంచనాలను తగినట్టు ఆడలేకపోయారు. బుమ్రా, బౌల్ట్ పేస్ నిప్పులు కక్కారు. ఈ ఇద్దరు 48 బంతుల్లో 42 పరుగులకే ఏడు వికెట్లు పడగొట్టారు. దీంతో లక్నో సూపర్‌జెయింట్స్‌పై ముంబయి ఇండియన్స్ లీగ్ దశలో తొలిసారి పైచేయి సాధించింది.

రికెల్టన్, సూర్య మెరుపుల్ : తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 215 పరుగుల భారీ స్కోరు చేసింది. తిలక్ వర్మ (6), హార్దిక్ పాండ్య (5), రోహిత్ శర్మ (12) నిరాశపరిచినా.. ఓపెనర్ రియాన్ రికెల్టన్ (58), సూర్యకుమార్ యాదవ్ (54) ధనాధన్ అర్ధ సెంచరీలతో మెప్పించారు. రికెల్టన్ ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లు బాదగా.. సూర్యకుమార్ యాదవ్ నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ ఇద్దరు మెరువగా ముంబయి ఇండియన్స్ భారీ స్కోరు చేసింది. ఆఖర్లో నమన్ ధిర్ (25 నాటౌట్), కార్బిన్ బాచ్ (20) సైతం ధనాధన్ ముగింపుతో అలరించారు. సూపర్‌జెయింట్స్ బౌలర్లలో అవేశ్ ఖాన్, మయాంక్ యాదవ్‌లు రెండేసి వికెట్లు పడగొట్టినా.. పరుగుల నియంత్రణలో అందరూ విఫలమయ్యారు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్ : 215/7 (రియాన్ రికెల్టన్ 58, సూర్యకుమార్ యాదవ్ 54, మయాంక్ యాదవ్ 2/40, అవేశ్ ఖాన్ 2/42)

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్ : 161/10 (ఆయుశ్ బదాని 35, మిచెల్ మార్ష్ 34, జశ్‌ప్రీత్ బుమ్రా 4/22, ట్రెంట్ బౌల్ట్ 3/20, విల్ జాక్స్ 2/18)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68